thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 121| జగిత్యాల | శనివారం 01 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### కామన్ వెల్త్ గేమ్స్ లో భారత్ కు మరో స్వర్ణం



11



## రూ.4.5 లక్షల కోట్లకు
# కేంద్ర కేబినెట్ ఆమోదం



### పీఎం కిసాన్‌కు రూ.3.15 లక్షల కోట్లు..
### సూర్య సరోవర్ యోజనకు రూ.5,070 కోట్లు
### కొత్త పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

దేశవ్యాప్తంగా వివిధ సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర కేబినెట్ భారీగా నిధులు కేటాయించింది. మొత్తం రూ.4,50,988 కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. కేబినెట్ నిర్ణయాల ప్రకారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి 2026-2030 కాలానికి రూ.3,15,614 కోట్లు కేటాయించారు. 2



### ఉపాధి, ఉద్యోగాల కల్పనపై
# సీఎం దృష్టి

- టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత
- డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ
- స్కిల్ వర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్

2

## ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా
# హైదరాబాద్
### పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రదేశం

- జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి పెంపే లక్ష్యం
- సీఐఐ ప్రతినిధులతో సమావేశంలో సీఎం

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, టోక్యో, న్యూయార్క్‌లతో పోటీపడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సీఐఐ నార్తర్న్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధుల తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన ప్రదేశమని, పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి భారీ పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. 2

**హైదరాబాద్, జూలై 31:** హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. టోక్యో, న్యూయార్క్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీపడే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఐఐ నార్తర్న్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన, సురక్షిత రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్న సీఎం, 2047 నాటికి 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. 2037 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు, దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో పాలసీ స్థిరత్వం ఉందని, మంచి విధానాలను ఏ ప్రభుత్వం తీసుకొచ్చినా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్యూర్-పప్యూర్-రేర్ అభివృద్ధి

మిగతా 2 లో

## తెలంగాణలో మరోసారి సీఐఆర్
# గడువు పొడిగింపు

- ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా విడుదల

2



### నాంపల్లి ఏసీబీ కోర్టుకు
# కేటీఆర్

- ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా

2

## తెలుగు రాష్ట్రాల్లో
# సీబీఐ సోదాలు

- రూ.105 కోట్ల బ్యాంకు రుణం ఎగ్గొట్టిన కేసులో తనిఖీలు
- హైదరాబాద్ సహా 10 ప్రాంతాల్లో ఏకకాల దాడులు

3

# పెద్ది సుదర్శన్ రెడ్డికి అశ్రునివాళి

- భారీగా తరలివచ్చిన అభిమానులు..
- భావోద్వేగానికి గురైన హరీశ్ రావు
- జనసంద్రంగా నర్సంపేట..
- కేసీఆర్, కేటీఆర్, సీఎం రేవంత్ సహా పలువురు ప్రముఖుల సంతాపం

2







# గోదావరి ఉగ్రరూపం

- భద్రాచలం, కాళేశ్వరం అప్రమత్తం
- ఎగువ ప్రాంతాల వర్షాలతో వరద
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక

2



## తెలంగాణలో
## ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు
# శ్రీకారం

- ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటు..

2

## విద్యార్థుల ముసుగులో అసాంఘిక శక్తుల దాడి



- మా సంగతేంటంటూ పోలీసుల కుటుంబాల ఆవేదన
- తమకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్

4

## లక్ష డాలర్లు

- ఓపీటీ వీసాపై లక్ష డాలర్ల ఫీజుకు ట్రంప్ సర్కారు కసరత్తు




అమెరికాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. అమెరికా విశ్వవిద్యాలయాల్లో విద్య పూర్తి చేసిన తర్వాత అక్కడే ఉద్యోగం చేయాలనుకునే విదేశీ విద్యార్థులపై లక్ష డాలర్ల వరకు ఫీజు విధించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

4

## సెప్టెంబర్‌లో బ్రిక్స్ సదస్సు

- భారత్ ఆతిథ్యంలో సమావేశాలు.. జిన్‌పింగ్ హాజరుపై ఆసక్తి
- గల్వాన్ ఘటన తర్వాత తొలి భారత పర్యటనకు అవకాశం..
- అధికారిక ప్రకటన కోసం వెయిటింగ్

4





# గోదావరి ఉగ్రరూపం

**భద్రాచలం, కాళేశ్వరం అప్రమత్తం**

**ఎగువ ప్రాంతాల వర్షాలతో భారీ వరద ప్రవాహం..**

**లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక**

**భద్రాద్రి కొత్తగూడెం/కాళేశ్వరం, జూలై 31:** ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం, కాళేశ్వరం వద్ద వరద ప్రవాహం భారీగా పెరగడంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం గోదావరి నీటిమట్టం 44 అడుగులకు చేరగా, 9,74,666 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి ఉధృతికి కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పగీర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. రానున్న గంటల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు గోదావరి వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. అదే సమయంలో కాళేశ్వరం వద్ద కూడా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం కేంద్రంలో గోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద 96.40 మీటర్ల నీటిమట్టం నమోదుకాగా, మొత్తం 8,35,800 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు బ్యారేజ్‌లోని 85 గేట్లను పగీర్తిగా ఎత్తి ఉంచారు. కాళేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయి 12.210 మీటర్లు, ప్రమాద స్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖలు వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి అవసరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించాయి.

# రూ.4.5 లక్షల కోట్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**పీఎం కిసాన్‌కు రూ.3.15 లక్షల కోట్లు..**

**సూర్య సరోవర్ యోజనకు రూ.5,070 కోట్లు**

**కొత్త పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్**

**న్యూఢిల్లీ, జూలై 31:** దేశవ్యాప్తంగా వివిధ సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర కేబినెట్ భారీగా నిధులు కేటాయించింది. మొత్తం రూ.4,50,988 కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. కేబినెట్ నిర్ణయాల ప్రకారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి 2026--2030 కాలానికి రూ.3,15,614 కోట్లు కేటాయించారు. రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించే ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహించే ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు రూ.5,070 కోట్లు మంజూరు చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి 5,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాబోయే ఐదేళ్లలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఏడు రెట్లు పెంచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అదేవిధంగా, సముద్రగర్భంలోని ముడి చమురు, సహజవాయువు వనరుల అన్వేషణ కోసం చేపట్టిన సముద్ర మంథన్ పథకానికి 2030--31 వరకు రూ.84,084 కోట్లు కేటాయించారు. క్రీడా రంగాభివృద్ధికి ఖేలో ఇండియా పథకానికి వచ్చే ఐదేళ్లకు రూ.29,054 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నెల్స్ నిర్మాణానికి రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు వ్యవసాయం, పునరుత్పాదక ఇంధనం, క్రీడలు, మౌలిక వసతులు, ఇంధన వనరుల అన్వేషణ వంటి కీలక రంగాల అభివృద్ధికి ఊతమివ్వనున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# నాంపల్లి ఏసీబీ కోర్టుకు కేటీఆర్

**ఫార్ములా ఈ రేస్ కేసు తదుపరి విచారణ 25కు వాయిదా**



**హైదరాబాద్, జూలై 31:** ఫార్ములా–ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామా రావు హాజరయ్యారు. ఏసీబీ కోర్టు నోటీసులతో తొలిసారిగా విచారణకు కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఫార్ములా–ఈ రేస్ కేసులో ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కార్ రేస్‌తో రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, కంపెనీని నిందితులుగా ఏసీబీ అధికారులు ఈ కేసులో చేర్చారు. ఛార్జ్‌షీట్ ధాఖలు చేసిన తర్వాత మొదటి కేసును న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ ఛార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకున్నామని కోర్టు తెలిపింది. తదుపరి ఈ కేసులో ట్రయల్ మొదలు పెట్టనుంది. తదుపరి విచారణను ఆగస్టు25వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. కేటీఆర్ లక్ష పగీచీకత్తు , 2 షూరిటీస్ సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

# ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

నమూనాతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా విస్తరిస్తున్నామని, భారత్ ఫ్యూచర్ సిటీ--మచిలీపట్నం 12 లేన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. తయారీ, సేవలు, వ్యవసాయ రంగాల్లో భారీ పెట్టుబడులకు ఆహ్వానం పలికిన సీఎం, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. తెలంగాణకు మూడు బుల్లెట్ రైలు మార్గాలు రానున్నాయని వెల్లడించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉద్యోగావకాశాలను పెంచుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో అమెజాన్, అదానీ వంటి ప్రముఖ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని, 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రపంచంలోని టాప్--500 కంపెనీలను తెలంగాణకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, "థింక్ గ్లోబల్... ఇన్వెస్ట్ లోకల్" అంటూ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు.



# ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సీఎం దృష్టి

**టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత**

**డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ**

**స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు**

**అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, జూలై 31: టామ్‌కాంకు** కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పగీర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి అశ్రునివాళి

- భారీగా తరలివచ్చిన అభిమానులు..
- భావోద్వేగానికి గురైన హరీశ్ రావు
- జనసంద్రంగా నర్సంపేట..
- కేసీఆర్, కేటీఆర్, సీఎం రేవంత్ సహా పలువురు ప్రముఖుల సంతాపం

**వరంగల్/హైదరాబాద్, జూలై 31:** తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి వేలాది మంది ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు అశ్రునివాళి అర్పించారు. ఆయన భౌతికకాయం నర్సంపేటకు చేరుకోగానే చివరిసారిగా దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూశారు. జూలై 26న అనారోగ్యానికి గురికావడంతో తొలుత స్థానిక ఆస్పత్రికి, అనంతరం హైదరాబాద్‌కు తరలించినప్పటికీ వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు అత్యంత సన్నిహిత సహచరుడిగా పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి, వరంగల్ జిల్లాలో ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2001లో టీఆర్ఎస్ తరఫున జెడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, జిల్లా పార్టీ కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు, అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా సేవలందించారు. అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్ రావు భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. తన ఆప్త మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కూడా చెప్పులు లేకుండానే అంతిమయాత్రలో పాల్గొని తన దీక్షను కొనసాగించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పలువురు పార్టీ



నాయకులు నల్లబెల్లికి చేరుకుని నివాళులర్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరుడిని, ఆప్త మిత్రుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ, పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమానికి, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పెద్ది మరణాన్ని పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటుగా అభివర్ణించారు. ఉద్యమ ఆశయాలకు జీవితాంతం కట్టుబడి పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ సహచరుడే కాకుండా తనకు ఆత్మీయ సోదరుడని పేర్కొన్నారు. ఆయన మరణం వ్యక్తిగతంగా, రాజకీయంగా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో నర్సంపేట శోకసంద్రంగా మారింది. అభిమానుల రోదనలు, నాయకుల నివాళుల మధ్య పెద్ది అంతిమయాత్ర విషాద వాతావరణంలో కొనసాగింది.

# తెలంగాణలో మరోసారి సీఐఆర్ గడువు పొడిగింపు

**హైదరాబాద్, జూలై 31:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఆగస్టు 10 వరకు అవకాశం కల్పిస్తూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తొలుత జూలై 24 వరకు ఉన్న గడువును ఆగస్టు 3 వరకు పొడిగించగా, తాజాగా మరో వారం రోజులు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలని సూచించింది. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను (డ్రాఫ్ట్ పబ్లికేషన్) విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటి పరిష్కార ప్రక్రియ చేపట్టి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం ఎన్యూమరేషన్ పగీర్తైనట్లు ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం ప్రక్రియ పగీర్తైనట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న సవరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించిన నవీన్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమై ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు.

# తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు శ్రీకారం

**ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, జూలై 31:** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మరో కొత్త సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో కుటుంబ సభ్యుల పగీర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇకపై ప్రజలు తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల ద్వారా ఈ ధ్రువపత్రాన్ని సులభంగా పొందవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలను అధికారికంగా ధ్రువీకరించేందుకు ఈ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందని భట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాల నిర్ధారణ అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించి, పారదర్శకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని ప్రభుత్వ



కార్యాలయాలు, అవసరమైన అధికారిక ప్రక్రియల్లో చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఈ కొత్త సేవను వినియోగించుకుని కుటుంబ వివరాలకు సంబంధించిన ధ్రువపత్రాలను సులభంగా పొందాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం



- లక్ష్య సాధనలో విఫలమైన కంపెనీలపై కఠిన చర్యలు
- ఇప్పటికే కంపెనీలకు పలుమార్లు నోటిసులు
- పురోగతి లేని కంపెనీలను తొలగించడానికైనా ప్రభుత్వం సిద్ధం.
- ప్రతి రైతుకు సకాలంలో మొక్కల పంపిణీ
- క్షేత్రస్థాయిలో సాంకేతిక సహాయం అందాలి
- కంపెనీల పనితీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి

**హైదరాబాద్, జూలై 31:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయిల్ పామ్ సాగు విస్తరణలో నిర్లక్ష్యం ప్రదర్శించే కంపెనీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. లక్ష్య సాధనలో విఫలమైన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైతే జిల్లాల బాధ్యతలను తగ్గించడం లేదా పగ్రీర్తిగా కంపెనీలను తొలగించడానికైనా ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాల్లోనే సాగు నమోదవడం (సుమారు 20 శాతం) నిరాశ కలిగించే విషయమని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నప్పటికీ కంపెనీల పనితీరులో చిత్తశుద్ధి కనిపించడం లేదని మండిపడ్డారు. పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. లోహియా, ఆయిల్ ఫెడ్, తిరుమల, ప్రియోనిక్, రామ్ చరణ్, గోద్రెజ్, విశ్వతేజ్, కేన్ బయో, పతంజలి, మాట్రిక్స్, సువేన్ ఆగ్రో వంటి సంస్థలకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆశించిన మార్పు రాలేదని చెప్పారు. గతంలో కొన్ని కంపెనీల పరిధిలోని జిల్లాలను ఇతర సంస్థలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇకపై కూడా పనితీరు మెరుగుపడకపోతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఇతర కంపెనీల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒక్క రైతు కూడా మొక్కల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. గ్రామ స్థాయిలో ఫీల్డ్ సిబ్బంది అందుబాటులో ఉండి సాగు విధానాలు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణపై రైతులకు నిరంతరం సాంకేతిక సహాయం అందించాలని సూచించారు. అలాగే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పగ్రీర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఆయిల్ పామ్ విస్తరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుందని, ఇందులో అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండదని తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# డా. నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్

- దేశానికే గర్వకారణం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- క్యాన్సర్ వైద్యరంగంలో విశేష సేవలకు ప్రశంసలు.. అభినందనలేఖ పంపిన హోంమంత్రి



**హైదరాబాద్, జూలై 31:** ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు, తెలంగాణ ప్రభుత్వ వైద్య సలహాదారు డా. నోరి దత్తాత్రేయుడికి భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారం ప్రకటించడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. వైద్యరంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా లభించిన ఈ గౌరవం దేశానికే గర్వకారణమని పేర్కొంటూ ప్రత్యేక అభినందనలేఖ పంపారు. తన లేఖలో డా. నోరి దత్తాత్రేయుడు క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచస్థాయిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పారని అమిత్ షా కొనియాడారు. విజ్ఞానం, సేవాభావం, సహానుభూతితో కూడిన ఆయన వైద్య సేవలు వేలాది మంది జీవితాల్లో ఆశాజ్యోతి నింపాయని ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పద్మ పురస్కారాలకు కొత్త గుర్తింపు లభించిందని అమిత్ షా పేర్కొన్నారు. కీర్తి, ప్రచారానికి దూరంగా సమాజ సేవను ధ్యేయంగా చేసుకుని పనిచేసే మౌన సాధకులు, కర్మయోగులకు ఈ పురస్కారాలు దక్కుతున్నాయని తెలిపారు. డా. నోరి రోగుల సంక్షేమం కోసం చూపుతున్న అంకితభావం వ్యక్తిగత విజయాన్ని మించి దేశసేవకు ప్రతీకగా నిలుస్తుందని హోంమంత్రి అభిప్రాయపడ్డారు. పరోపకార మహిమను వివరిస్తూ సంస్కృత శ్లోకాన్ని ప్రస్తావించిన ఆయన, డా. నోరి సంపగ్రీర్ణ ఆరోగ్యంతో మరెన్నో సంవత్సరాలు సమాజానికి తన అమూల్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

- ఆగస్టు చివరి వారంలో పనులకు శ్రీకారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్
- తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం..
- లబ్ధిదారులకు 20-22 గజాల ఉచిత రిజిస్ట్రేషన్
- భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతిపై మంత్రి సమీక్ష

**హైదరాబాద్, జూలై 31:** పేదలకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే ఇందిరమ్మ టవర్స్ టెండర్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టనుండగా, మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పగ్రీర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 10వ తేదీ తుది గడువు అని, ఆ తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబోమన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి ధ్రువపత్రాలు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. ఒకవేళ ఇల్లు కేటాయించని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన రూ. 10 వేల ఈఎండీ మొత్తాన్ని 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించినట్లయితే నేరుగా అదే ఖాతాకు నగదు జమ అవుతుందని వివరించారు. ఈ ప్లాట్ల మార్కెట్ విలువ రూ. 40 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు ఉంటుందని, లబ్ధిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను పగ్రీర్తిగా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిస్తామని వెల్లడించారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేదలకు గౌరవప్రదమైన నివాసాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పొంగులేటి పేర్కొన్నారు.

### గోదావరి వరద ఉధృతి.. ముందస్తు చర్యలకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో, పరివాహక ప్రాంతాల ప్రజల భద్రత కోసం అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో టెలిఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు కలెక్టర్ మంత్రికి వివరించారు. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం 48 అడుగులకు చేరిందని, 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్యం, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని, రెవెన్యూ, పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వదంతులను నమ్మకుండా ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.






# తెలుగు రాష్ట్రాల్లో సీబీఐ సోదాలు

## రూ.105 కోట్ల బ్యాంకు రుణం ఎగ్గొట్టిన కేసులో తనిఖీలు

## హైదరాబాద్ సహా 10 ప్రాంతాల్లో ఏకకాల దాడులు

**హైదరాబాద్, జూలై 31:** తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారులు గురువారం విస్తృత సోదాలు నిర్వహించారు. రూ.105 కోట్ల బ్యాంకు రుణం ఎగ్గొట్టిన కేసుకు సంబంధించి ఎన్‌సీఎస్ షుగర్స్ లిమిటెడ్ కంపెనీతో పాటు ఆ సంస్థ డైరెక్టర్లకు చెందిన నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, విజయనగరం, కాకినాడతో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగాయి. సీబీఐ వివరాల ప్రకారం.. చెన్నైలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.105 కోట్ల రుణాన్ని పొందిన ఎన్‌సీఎస్ షుగర్స్ సంస్థ, అనంతరం రుణాన్ని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. రుణాల మంజూరుకు నకిలీ పత్రాలను అసలైనవిగా చూపించి బ్యాంకును మోసం చేసినట్లు దర్యాప్తులో గుర్తించిన అధికారులు కేసు నమోదు చేసి సోదాలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా కీలక పత్రాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న ఆధారాల ఆధారంగా కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# అయోధ్య విరాళాల చోరీ వ్యవహారం

## పార్లమెంట్ ముందు ఎంపీల మాక్ విన్యాసం




**న్యూఢిల్లీ, జూలై 31:** అయోధ్యలోని రామమందిరంలో విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు వినూత్నంగా నిరసన తెలిపారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో ఒక వీధి నాటకాన్ని ప్రదర్శించారు. బీహార్‌లోని పగ్రీర్నియా కాంగ్రెస్ ఎంపీ పప్పు యాదవ్ ఒక హిందూ సన్యాసి వేషంలో కనిపించారు. సమాజ్‌వాదీ పార్టీ మహిళా ఎంపీ ఒక భక్తురాలి పాత్రను పోషించారు. ఆ భక్తురాలు గుడి పేరు మీద డబ్బు సమర్పించగా, ఆ సన్యాసి 'దొంగతనం మా రక్తంలోనే ఉంది' అని చెబుతూ ఆ విరాళాన్ని తన జేబులో వేసుకున్నారు. కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. నిరసన ప్రదేశంలో ఉంచిన విరాళాల పెట్టెలో ప్రతీకాత్మక కానుకగా ఆయన డబ్బులు వేశారు. కొందరు ఎంపీలు కూడా విరాళాలు సమర్పించారు. ఆ తర్వాత యాదవ్ పాత్ర ఎంపీ ఆ విరాళాల పెట్టెను తీసుకుని నడుచుకుంటూ వెళ్ళిపోతారు. అక్కడ గుమిగూడిన ప్రతిపక్ష ఎంపీలు హర్షధ్వానాలు, నవ్వులతో హోరెత్తించారు. కానుకలు, అధికారాన్ని అపహరించారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు నీట్ వివాదంపై సీజేపీ నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగంపైనా ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. 'కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు ఎందుకు రావడం లేదు? ఈ ఆదేశం ఎవరు ఇచ్చారు?' అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ బదిలీకి హైకోర్టు ఆదేశం

## కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన స్పష్టమని వ్యాఖ్య..

## కొత్త అధికారిని నియమించాలని సీఎస్‌కు సూచన



**హైదరాబాద్, జూలై 31:** హైడ్రా–శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించిన లోతుకుంట భూముల వివాదంలో తెలంగాణ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేసి, ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు సూచించింది. లోతుకుంట భూముల వ్యవహారంపై విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినట్లు స్పష్టంగా కనిపిస్తోందని హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన టాటా మోహన్‌రావు కేసు తీర్పును హైకోర్టు ప్రస్తావించింది. చట్టపాలనకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించరాదని, వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్‌ను తక్షణమే బదిలీ చేసి, కొత్త అధికారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

## సంపాదకీయం



# పార్లమెంట్‌ను సాగనివ్వని లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్!

పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. వారం దాటినా కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. కేవలం పేపర్ లీక్ బిల్లు మాత్రం ఆమోదం పొందింది. ఇక అనేకానేక సమస్యలు ఉన్నా వాటిపై చర్చ సాగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే గతంలోనూ ఇలాగే సాగింది. గత పార్లమెంట్ రికార్డును పరిశీలిస్తే ఇదే కనిపిస్తుంది. విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీఛార్జ్‌పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే బలప్రయోగానికి దిగడంపై ప్రతిపక్ష పార్టీలు హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే జంతర్ మంతర్ ఘటనలో పలుఉవరు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కొందరి తలలు పగిలాయి. ఎందరో రక్తమోడారు. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు రెండురకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారు. ఆందోళనలను అణచివేయడంతో పాటు, తమతను తాము కాపాడుకుంటూ, పైఅధికారులను కాపాడాలి. ఈ సందర్భంగా వారు విధిలేని సమయంలో లాఠీఛార్జ్‌కు పాల్పడాల్సి వస్తుంది. ఇకపోతే అనేక సందర్భాల్లో అతిగా కూడా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయి. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం ఎలాంటి గుంపునైనా చెదరగొట్టడానికి నోటీసులు ఇచ్చిన తర్వాతే బలప్రయోగం చేయాలి. మానవ హక్కుల కమిషన్ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్, హెచ్చరికల తర్వాతే అత్యల్ప బలాన్ని ఉపయోగించాలి. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను క్షేత్రస్థాయిలో పోలీసులు పగీర్తిగా కాలరాస్తున్నారు. అరెస్టు సమయంలో పాటించాల్సిన చట్టబద్ధమైన పక్రియలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అరెస్టు నిబంధనలు ఎల్లప్పుడూ పాటిస్తున్నామని కేవలం 41 శాతం మంది పోలీసులు మాత్రమే అంగీకరిస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులకు కారణాలు చెప్పడం, వైద్య పరీక్షలు నిర్వహించడం వంటివి సరిగ్గా జరగడం లేదు. నిందితులు తమ న్యాయవాదిని సంప్రదించే హక్కును శాశ్వతంగా రద్దు చేయాలని 20 శాతం మంది పోలీసులు వాదిస్తున్నారు. లాఠీఛార్జీలు, హింసాత్మక సంఘటనల్లో గాయపడిన పౌరుల లెక్కల విషయంలో అధికారిక గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు, కస్టడీ మరణాల వివరాల సేకరణలో మన డేటా వ్యవస్థ విఫల మవుతోంది. పోలీస్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పౌరుల హక్కుల రక్షణతో పాటు చట్ట పాలన సక్రమంగా సాగేలా చూడటమే ప్రజాస్వా మ్యానికి శ్రీరామరక్ష. ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ మార్గాలను ఎంచుకోవడం పోలీసు వ్యవస్థకే తీవ్ర నష్టం కలిగిస్తుంది. పోలీసులు చట్టానికి లోబడి పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిక్షణ సమయంలో మానవ హక్కుల పట్ల అవగాహన పెంచడం ద్వారానే పౌర హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. కానీ స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025 సర్వేలో వెల్లడైన నిజాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. 17 రాష్ట్రాల్లోని 8,276 మంది పోలీసుల అభిప్రాయాలను సేకరించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది తమ చర్యలపై ఎలాంటి విచారణ ఉండకూడదని భావిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన గణాంకాలు దేశంలో పోలీసుల అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతానికి పైగా పోలీసులు బాధ్యతల నిర్వహణలో బలప్రయోగం చేసినా తమపై ఎలాంటి శిక్ష పడకూడదని స్పష్టం చేస్తున్నారు. కోర్టు విచారణ లేకుండానే అనుమానితులను అరెస్టు చేసి డిటైన్ చేసే అధికారం పోలీసులకు ఉండాలని 69 శాతం మంది కోరుకుంటున్నారు. ప్రజల్లో భయం పుట్టించడానికి కఠిన పద్ధతులు ఉపయోగించడం అత్యంత అవసరమని 55 శాతం మంది పోలీసులు అభిప్రాయపడ్డారు. నిరసనకారులపై లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలు చూస్తున్నప్పుడు ప్రతీ ఒక్కరి మనసులో మెదిలే ప్రశ్న ఇది. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించడానికి సమాజం నుంచి వస్తున్న ఒత్తిడే కారణమని పోలీసులు చెబుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో అమాయకులు సైతం పోలీసుల ఆగడాలకు బలవుతున్నారు. నిందితులపై తీవ్రంగా విరుచుకుపడటానికి ప్రజల ఒత్తిడే ప్రధాన కారణమని మూడింట రెండు వంతుల మంది పోలీసులు చెబుతున్నారు. . నేరాల నియంత్రణకు అసాంఘిక శక్తుల ముందస్తు అరెస్టులు చాలా ఉపయోగపడతాయని 48 శాతం మంది స్పష్టం చేశారు. నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతున్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపగీర్ నిరసనల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో కేవలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

# విద్యార్థుల ముసుగులో అసాంఘిక శక్తుల దాడి

- మా సంగతేంటంటూ పోలీసుల కుటుంబాల ఆవేదన
- తమకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్



**న్యూఢిల్లీ, జులై 31:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనల సమయంలో తీవ్రంగా గాయపడిన ఢిల్లీ పోలీసు సిబ్బంది కుటుంబాలు న్యాయం కోసం ముందుకు వచ్చాయి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పాటు చెప్పులతో దాడి చేశారని వారు ఆరోపించారు. దేశ రాజధానిలో జరిగిన ఈ ఘర్షణల్లో ఎంతో మంది పోలీసులు గాయపడినా, కేవలం ఒక వైపు మాత్రమే ప్రచారం జరుగుతోందని, తమ ఆవేదనను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా కుటుంబాలు వాపోయాయి. శుక్రవారం మీడియా ముందుకు వచ్చిన గాయపడిన పోలీసుల భార్యలు, కుమారులు, కుమార్తెలు నాటి భయానక ఘటనలను కన్నీటిపర్యంతమవుతూ గుర్తుచేసుకున్నారు. ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో అసాంఘిక, సంఘ విద్రోహ శక్తులు చొరబడి మనుషులపైకి ఉసిగొలిపాయని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఓ ఏసీపీ కుమారుడు మాట్లాడుతూ.. తన తండ్రి తలకు తీవ్ర గాయమై నాలుగు కుట్లు పడ్డాయని, యూనిఫామ్ మొత్తం రక్తంతో తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేవీలో మెరైన్ కమాండోగా పనిచేసి, ప్రస్తుతం ఢిల్లీ పోలీసు విభాగంలో ఎస్సైగా సేవలందిస్తున్న తన తండ్రిని ఆందోళనకారులు ఈడ్చుకెళ్లి దాడి చేశారని, దాదాపు నాలుగు గంటల పాటు ఆయన స్పృహ కోల్పోయారని మరో కుమార్తె తెలిపారు. సోషల్ మీడియాలో తమ తండ్రినే నేరస్థుడిగా చిత్రీకరిస్తుండటంతో న్యాయం కోసం తాము సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని వెల్లడించారు. 33 ఏళ్లుగా శాఖలో సేవలందిస్తున్న తన భర్తను కూడా రాళ్లు, చెప్పులతో విచక్షణారహితంగా కొట్టారని, ఆయన హెల్మెట్ సైతం పగిలిపోయిందని మరో ఏఎస్ఐ భార్య సీమ కంటతడి పెట్టారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పోలీసులపై ఈ తరహా దాడులను సహించరాదని, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి.

# ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

### మెటా ఇండియా హెడ్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల కేసు




**హైదరాబాద్:** భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య వివాదం మరింత ముదిరింది. ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేశారన్న ఆరోపణలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై ఈ కేసులు నమోదయ్యాయి. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, హైదరాబాద్ పోలీసులు ఈ చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన అసలు వీడియోను కొందరు ఏఐ సహాయంతో ఎడిట్ చేసి తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ డీప్‌ఫేక్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు, సోషల్ మీడియాలో ఇవి ఎలా విస్తృతంగా వ్యాపించాయి, ప్లాట్‌ఫామ్‌ల వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో ఎందుకు విఫలమయ్యాయి అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ప్లాట్‌ఫామ్‌లలోని నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను తొలగించే ప్రక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై తమ కంటెంట్ మోడరేషన్ విధానాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని, డిజిటల్ ఆధారాల ప్రకారమే దర్యాప్తు జరుపుతామని, పగీర్తి విచారణ తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు.

# విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

### ఓపీటీ వీసాపై లక్ష డాలర్ల ఫీజుకు ట్రంప్ సర్కారు కసరత్తు

**న్యూయార్క్, జూలై 31:** అమెరికాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. అమెరికా విశ్వవిద్యాలయాల్లో విద్య పగీర్తి చేసిన తర్వాత అక్కడే ఉద్యోగం చేయాలనుకునే విదేశీ విద్యార్థులపై లక్ష డాలర్ల వరకు ఫీజు విధించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, హెచ్-1బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజు విధించే ప్రతిపాదనకు అమెరికా కోర్టు అనుమతి ఇవ్వకపోవడంతో, ఇప్పుడు ఓపీటీ వీసా విధానంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విద్యార్థి వీసా (ఎఫ్-1) అనంతరం ఉద్యోగ అనుభవం కోసం ఇచ్చే ఓపీటీ అనుమతిపై అధిక ఫీజు వసూలు చేసే అంశాన్ని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ పరిశీలిస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు. ఓపీటీ కార్యక్రమం ద్వారా విదేశీ విద్యార్థులు తమ విద్య పగీర్తయిన అనంతరం అమెరికాలో గరిష్టంగా మూడు సంవత్సరాల వరకు ఉద్యోగం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం కోర్సులు పగీర్తిచేసిన విద్యార్థులు ఈ సౌకర్యాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. 2024 నాటి అధికారిక గణాంకాల ప్రకారం, సుమారు 4.19 లక్షల మంది విదేశీ విద్యార్థులు ఓపీటీ కార్యక్రమం కింద అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే వేలాది మంది అంతర్జాతీయ విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే హెచ్-1బీ వీసాదారులపై భారీ ఫీజు ప్రతిపాదనను అమెరికాలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు వ్యతిరేకించాయి. అమెరికా విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులైన విదేశీ విద్యార్థులకు ఈ సంస్థలే అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న నేపథ్యంలో, తాజా ప్రతిపాదనపై కూడా కార్పొరేట్ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, లక్ష డాలర్ల ఫీజు ప్రతిపాదనపై ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం ఈ అంశం విధానపరమైన పరిశీలన దశలో ఉన్నట్లు సమాచారం.

# పీవోకేలో పాక్ కాల్పులు

### తీవ్రంగా ఖండించిన భారత్

### పౌరులపై బలప్రయోగంపై ఆందోళన

### అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని భారత విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 31: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో పౌరులపై పాకిస్థాన్ సైన్యం జరిపినట్లు ఆరోపణలు వస్తున్న కాల్పుల ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పౌరులపై బలప్రయోగాన్ని ఖండిస్తూ, ఈ ఘటనలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను జవాబుదారీగా చేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చింది. స్థానిక మానవ హక్కుల సంఘాలు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్‌పగీర్, కోట్లి, ముజఫరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రజలు శాంతియుతంగా లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ సైన్యం నిరసనకారులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనల్లో 40 మందికి పైగా నిరసనకారులు మృతిచెందగా, వంద మందికిపైగా గాయపడినట్లు స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా, వందలాది మందిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకులు చేసిన ఆరోపణల ప్రకారం.. ఘటనల అనంతరం స్థానిక ఆసుపత్రులు, వీధుల నుంచి మృతదేహాలను భద్రతా బలగాలు తరలించి, వివరాలను గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై స్వతంత్రంగా ధృవీకరణ జరగాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో పీవోకేలో మానవ హక్కుల పరిస్థితిపై అంతర్జాతీయ సంస్థలు స్పందించాలని భారత్ కోరింది. పౌరుల భద్రత, ప్రాథమిక హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సెప్టెంబర్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

- భారత్ ఆతిథ్యంలో సమావేశాలు.. జిన్‌పింగ్ హాజరుపై ఆసక్తి
- గల్వాన్ ఘటన తర్వాత తొలి భారత పర్యటనకు అవకాశం.. అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు




**న్యూఢిల్లీ, జూలై 31:** భారత్ ఆతిథ్యంలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆయన భారత పర్యటనపై ఇప్పటివరకు భారత్ లేదా చైనా నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. బ్రిక్స్ కూటమికి ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సభ్య దేశాధినేతలకు భారత్ ఇప్పటికే అధికారిక ఆహ్వానాలు పంపింది. అందులో భాగంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కూడా సదస్సుకు ఆహ్వానించినట్లు సమాచారం. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ అనంతరం ఇరు దేశాల సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతలకు గురయ్యాయి. ఆ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఈ సమావేశానికి హాజరైతే, గల్వాన్ ఘటన తర్వాత చేపట్టే తొలి భారత పర్యటనగా నిలవనుంది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ కీలక వేదిక అని పేర్కొన్నారు. బ్రిక్స్ కార్యకలాపాలకు చైనా పగీర్తి మద్దతు ఇస్తుందని, భారత్ అధ్యక్షతను విజయవంతం చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశముందని క్రెమ్లిన్ ఇప్పటికే వెల్లడించింది. బ్రిక్స్ సభ్యదేశమైన ఇరాన్ కూడా సమావేశంలో పాల్గొనే అవకాశమున్నప్పటికీ, ఏ స్థాయి ప్రతినిధి బృందం వస్తుందన్న విషయంపై స్పష్టత లేదు. అలాగే బంగ్లాదేశ్ ప్రధానికి కూడా ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం పంపినట్లు సమాచారం. ఈ ఆహ్వానాన్ని పరిశీలిస్తున్నట్లు బంగ్లాదేశ్ విదేశాంగ వర్గాలు తెలిపాయి. బ్రిక్స్ కూటమిలో తొలుత బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సభ్యదేశాలుగా ఉండగా, 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ చేరాయి. 2025లో ఇండోనేషియా కూడా సభ్యత్వం పొందడంతో కూటమి మరింత విస్తరించింది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పెట్టుబడులు, బహుళపాక్షిక సహకారం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. జిన్‌పింగ్ హాజరుపై అధికారిక ప్రకటన వెలువడితే, సదస్సుకు మరింత ప్రాధాన్యత ఏర్పడనుంది.

## రేషన్ కార్డు ఈకేవైసీ గడువు పెంపు




**కెరమెరి:** మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు గడువును పొడిగించినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వీలైనంత త్వరగా తమ ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ దుకాణాల్లో ఏర్పాటు చేసిన ఈపోస్ యంత్రాల ద్వారా ఉచితంగా వేలిముద్రలు నమోదు చేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చని, రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు, చిన్నారులతో సహా, బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఇందుకోసం ఒరిజినల్ రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు వెంట తీసుకురావాలని సూచించారు. వృద్ధులు, వేలిముద్రలు నమోదు కాని వారికి ఐరిస్ స్కాన్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. పెంపొందించిన గడువులోపు ఈకేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డులు ఇన్యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున కెరమెరి మండల ప్రజలు తమ సమీప రేషన్ డీలర్ను సంప్రదించి వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కెరమెరిలో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం



**కెరమెరి:** కెరమెరి గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. సర్పంచ్ పెందొర్ ఆనంద్ రావు, గ్రామ కార్యదర్శి పర్యవేక్షణలో శుక్రవారం గ్రామంలోని పలు కాలనీలు, మార్కెట్ ప్రాంతం, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమలు, వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం గ్రామ పరిశుభ్రత కోసం శ్రమిస్తుండటంతో ఇప్పటివరకు గ్రామంలో మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా నివారించగలిగామని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇదేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్న సర్పంచ్, గ్రామ కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

## ముత్తగూడెం వద్ద బైకును ఢీకొట్టిన కారు

### ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ముత్తగూడెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఓ కారు ముందుగా వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు రోడ్డుపై పడిపోగా, కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న తుప్పల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నరసింహారావును పరామర్శించిన మంత్రి తుమ్మల

**సత్తుపల్లి:** హైదరాబాద్లోని ఫిలింనగర్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న నరసింహారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. అనంతరం నరసింహారావుకు చికిత్స అందిస్తున్న వైద్యులతో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



# ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

- ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 100% ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి
- మీడియా సమావేశంలో రియాజ్ అహ్మద్



**ఆసిఫాబాద్:** ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును ప్రతీ అర్హుడికి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అహ్మద్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్ఐఆర్ కో-ఆర్డినేటర్ ఆరెపల్లి మోహన్ అన్నారు. శుక్రవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ దాదాపు 100 శాతం పూర్తయినట్లు ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో వ్యతిరేక ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. గతంలో నాలుగు రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలే ఇందుకు ఉదాహరణని, అందుకే తెలంగాణలో ప్రతి అర్హుడి ఓటును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియను సవాలుగా తీసుకుందని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి శ్రమించిన బి.ఎల్.ఏలు, పోలింగ్ బూత్ అబ్జర్వర్లు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు మరియు నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

### అర్హులందరికీ ఓటు హక్కు లభించాలి: ఆత్రం సుగుణ

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కు కోల్పోకూడదనేది ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ల స్పష్టమైన లక్ష్యమని తెలిపారు. అందుకే రాష్ట్ర నాయకులు స్వయంగా జిల్లాల్లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించారని పేర్కొన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు (బి.ఎల్.ఏలు), పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కొత్త ఓటర్ల నమోదుకు కృషి చేశారని వివరించారు. ఓటరు జాబితాలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే స్థానిక కాంగ్రెస్ నేతలను లేదా బి.ఎల్.ఏలను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యాం నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల మంగ, కూడ్మేత విశ్వనాథ్, డీసీసీ ఉపాధ్యక్షులు భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శులు గాదెవేణి మల్లేష్, విజయ్, శోభన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ సహా పలు మండలాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## సదరం శిబిరంలో వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని సాధారణ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరంలో వైద్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించి లోకో మోటార్ (ఆర్థోపెడిక్) విభాగానికి సంబంధించిన వైకల్య నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన దివ్యాంగులకు యు డి ఐ డి ధృవపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని, దివ్యాంగుల ధ్రువపత్రాల జారీకి సంబంధించిన ప్రక్రియలో ఎలాంటి పనులు పెండింగ్‌లో లేకుండా సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సులభంగా అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. శిబిరానికి హాజరైన లబ్ధిదారుల సంఖ్య, దివ్యాంగత్వాన్ని అంచనా వేసే విధానం, వివిధ రకాల వైకల్యాలకు అనుగుణంగా నిర్ధారించే వైకల్య శాతం తదితర వివరాలను ఆర్థోపెడిక్ అసెస్‌మెంట్ వైద్యుడిని అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో వైకల్య నిర్ధారణ ప్రక్రియ, వివిధ రకాల వైద్య పరీక్షలను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.డి. రామకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి ఉప పర్యవేక్షకులు డా. కృష్ణ, యు డి ఐ డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్సీ దండే విఠల్
- కాగజ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా ఐదు డయాలసిస్ బెడ్ల ప్రారంభం



**కాగజ్నగర్:** రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్ తోటలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అదనపు ఐదు డయాలసిస్ బెడ్లను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మెరుగైన చికిత్స కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని వైద్య సౌకర్యాలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు డయాలసిస్ అత్యంత అవసరమైన చికిత్స అని, ఇప్పటి వరకు పరిమిత సంఖ్యలో ఉన్న బెడ్ల కారణంగా రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉండేవని తెలిపారు. అదనంగా ఐదు డయాలసిస్ బెడ్లు అందుబాటులోకి రావడంతో మరింత మంది రోగులకు సకాలంలో చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అమలులో నియోజకవర్గానికి జిల్లా రెండో స్థానం

- వేంసూరు మండలానికి ప్రథమ స్థానం
- అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏల కృషిని అభినందించిన ఎమ్మెల్యే



**సత్తుపల్లి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలులో సత్తుపల్లి నియోజకవర్గం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ద్వితీయ స్థానాన్ని దక్కించుకోగా, నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచి విశేష గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఈ విజయం తన నాయకత్వంతో పాటు మండల తహశీల్దార్ సమర్థ పర్యవేక్షణ, రెవెన్యూ అధికారుల కృషి, బీఎల్ఓలు, బీఎల్ఏలు అంకితభావంతో పనిచేయడంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమిష్టిగా పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అన్నారు. అలాగే సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమా ఆనంద్బాబు, వేంసూరు గ్రామ సర్పంచ్ ఎండి. ఫఖ్రుద్దీన్ అందించిన సహకారం, ప్రోత్సాహం కూడా కార్యక్రమం విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఎంఆర్ఓ, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులతో పాటు ఓటరు నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొన్న ప్రతి ఓటరికి అభినందనలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి





**కాగజ్నగర్:** ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శుక్రవారం కాగజ్నగర్ పట్టణంలోని పోచమ్మ బస్తీలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. వాడవాడకు, ఇంటింటికి వెళ్లి బీఎల్ఓలు చేపడుతున్న సర్వే విధానాన్ని, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో అర్హుల పేరు నమోదయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు, నిర్లక్ష్యానికి తావులేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి గారు, స్థానిక కౌన్సిలర్లు దుర్గం సూరజ్ గారు, మాణిక్యం గారు, బీఎల్వోలు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ, కర్తవ్యకి నిదర్శనం శ్రీరామ్ సత్యనారాయణ

- శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు చిలువేరు వెంకటేశ్వర్లు
- ఘనంగా పదవీ విరమణ మహోత్సవం



**ఆసిఫాబాద్ టౌన్:** శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గత 32 సంవత్సరాలుగా అమూల్యమైన సేవలు అందించిన ఆచార్యులు శ్రీరామ్ సత్యనారాయణ పదవీ విరమణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. పాఠశాల అధ్యక్షులు చిలువేరు వెంకన్న జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రస్తుత, పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, పూర్వ ప్రధాన ఆచార్యులు మాట్లాడుతూ శ్రీరామ్ సత్యనారాయణ సేవలను కొనియాడారు. సత్యనారాయణ ఆచార్య నీతికి, నిజాయితీకి, కర్తవ్య నిష్టకు నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. సమయపాలన, నిరంతర సహనంతో పాఠశాల బాధ్యతలను నిర్వర్తించారని గుర్తు చేసుకున్నారు. తన మధురమైన తెలుగు పాటలు, కవితలు, పురాణ ఇతిహాసాల బోధన ద్వారా విద్యార్థుల మనస్సుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. పాఠశాలలో విద్యను అందించడమే కాకుండా ఇతర సామాజిక సేవలలో, ఆర్ఎస్ఎస్ సంస్కర్తగా ఆయన చూపిన అంకితభావం, నిస్వార్థ సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. సన్మాన గ్రహీత శ్రీరామ్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. 32 ఏళ్ల బోధనా అనుభవంలో విద్యార్థులతో పంచుకున్న తీపి గుర్తులలోని మధురానుభూతులను ఆయన పంచుకున్నారు. తాను విద్యాబుద్ధులు నేర్పించిన విద్యార్థులు నేడు సమాజంలో ఉన్నత స్థాయిల్లో, విదేశాలలో సైతం స్థిరపడటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనుమన్ల రాజన్న, అకడమిక్ ఇంచార్జీ పూదరి సత్యనారాయణ, పాఠశాల ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థి డెప్యూటీ డిఎంహెచ్ఓ సిడాం నాగేంద్ర, వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, ఎకిరాల శ్రీనివాస్, కల్లూరి సంతోష్, జంజిరాల శ్రీనివాస్, కట్కూరి స్వాతి, పెంద్యాల సదాశివ్, కిల్లి వెంకట్రావు పాల్గొన్నారు. అలాగే పూర్వ ఆచార్యులు రావుల రామన్న, కిరణ్, బాలేశ్వర్, వెంకటాచారి, ఢిల్లీ విజయ్ కుమార్, పాలక మండలి (అకసం) సభ్యులు, పూర్వ విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

# కేజీ వీల్స్ ట్రాక్టర్లను రహదారులపై నడపొద్దు



**తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్అండ్బి ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై కేజీ వీల్స్ కలిగిన ట్రాక్టర్లను నడపవద్దని తాండూర్ ఎస్సై కె.ప్రసాద్రావు హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ ట్రాక్టర్ యజమానులకు పోలీసు శాఖ తరపున ముందస్తు సూచనలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే ట్రాక్టర్లకు అమర్చే కేజీ వీల్స్తో రహదారులపై ప్రయాణించడం ద్వారా రోడ్లు దెబ్బతింటాయని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. రహదారులను ధ్వంసం చేసే విధంగా కేజీ వీల్స్తో ట్రాక్టర్లు నడిపినట్లు సమాచారం అందితే సంబంధిత డ్రైవర్తో పాటు ట్రాక్టర్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయానికి ఉపయోగించే ఇనుప పరికరాలు, కేజీ వీల్స్ కూడిన ఇతర వాహనాలను కూడా ప్రధాన రహదారులు, జాతీయ రహదారులపై నడపవద్దని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారెవరైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సమగ్ర భూ సర్వేతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు

**తాండూర్:** ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల రేపల్లెవాడ గ్రామంలో శుక్రవారం సమగ్ర భూ సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల కొలతలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా భూ రికార్డుల నిర్వహణ పారదర్శకంగా, సులభంగా మారడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే అవగాహన కార్యక్రమాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని సర్వే ప్రక్రియలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, ఏడీ శ్రీనివాస్, ఆర్ఐ టి.మురళీధర్రావు, సర్వేయర్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, వార్డు సభ్యులు, రేపల్లెవాడ గ్రామ రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షా లకు ధ్వంసమైన సీసీ రోడ్డు



**తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డు విష్ణు శివానికేతన్ స్కూల్ కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. ఈ రోడ్డు గుండా ప్రతిరోజు ఎస్టీ కాలనీ ప్రజలతో పాటు ఆటోల ద్వారా విద్యార్థులు వెళ్తుంటారు. రోడ్డు ధ్వంసం కావడంతో సర్వీసు రోడ్డుపై దిగి పిల్లలు నడిచిపోయే పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలంలో ఈ రోడ్డు గుండా కిష్టంపేట గ్రామ శివారులోని చెరువు మట్టిని ట్రాక్టర్ల ద్వారా మాఫియా తరలించారు. ధ్వంసమైన సీసీ రోడ్డుపై చెరువు మట్టిని వేయడంతో వర్షాలు పడ్డ సమయంలో రోడ్డు బురదమయంగా మారింది. దీనికితోడు ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ప్రజలకు రాకపోకలు సాగించడం కష్టతరంగా మారింది. ఇప్పటికైనా తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించి ధ్వంసమైన సీసీ రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఖాళీ స్థలాలు శుభ్రం చేయకుంటే రూ.10వేల జరిమానా

- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్




**ఆదిలాబాద్:** పట్టణంలోని విలీన గ్రామపంచాయతీలు, 49 వార్డుల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను 15 రోజుల్లోగా శుభ్రం చేసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రూ.10వేల వరకు జరిమానా విధించి, ఆ మొత్తాన్ని ప్రాపర్టీ ట్యాక్స్లో జత చేస్తామని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ హెచ్చరించారు. శుక్రవారం వార్డు నం.12 పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డ్, భగవతీనగర్ కాలనీల్లో నిర్వహించిన 'డ్రై డే–ఫ్రైడే' కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్ ఆత్రం సాయి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, వైద్య సిబ్బందితో కలిసి కాలనీల్లో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల నివారణకు ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త పేరుకుపోకుండా చూసుకోవడంతో పాటు డబ్బాలు, కుండీలు, నీటి ట్యాంకులు, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఖాళీ స్థలాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో కలుపు మొక్కలు పెరిగి, మురుగు నీరు నిలిచి దోమల వ్యాప్తికి కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలాల యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించి వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన మాట్లాడుతూ జ్వరం, దగ్గు, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, వైద్యుల సూచనల మేరకు ఉచిత వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య శాఖ వైద్య సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి



**కెరమెరి:** మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కెరమెరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ సుజయిత్ ఖాన్ అన్నారు. పార్టీ నాయకులు డీసీసీ కార్యాలయంలో శుక్రవారం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణతో పాటు మండల అధ్యక్షుడు సుజయిత్ఖాన్ను శాలువతో ఘనంగా సన్మానించారు. శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా చేపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**తలమడుగు:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ తో కలిసి మండలం రుయ్యాడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ–2ల ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏ–2లు చేపట్టాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేయడంతో పాటు, తప్పులు, లోపాలను సకాలంలో సరిదిద్దాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ప్రతాప్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్లు, పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఏ–2లు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ




**తాండూర్:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తాండూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో సిబ్బంది వర్షాకాలంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ విధులు నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి దొండ దివాకర్, వార్డు సభ్యులు సింగరావు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో తహశీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్లతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ, అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని పాతకొమ్ముగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్తో కలిసి గ్రామంలో చెరువును పరిశీలించారు. నీటి నిల్వలు, చెరువు పరిస్థితిపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపీ, ల్యాబ్, మందుల నిల్వలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సమయపాలన పాటిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో , జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 90 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కలెక్టర్ నీ శాల్వతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల

## వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు



**తిర్యాణి:** వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ మడావి పార్వతి అన్నారు. మండలంలోని ఎదులపాడ్ గ్రామ పంచాయతీలోని ఎదులపాడ్ గ్రామంలో ముందస్తుగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. దోమల నివారణ కోసం మంచి నీటి బావులలు, బోర్ వద్ద, డ్రైనేజ్ ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అదేవిధంగా పాత డ్రమ్ములు, పాత టైర్లు, కొబ్బరి బోండాలలో నీరు నిల్వ ఉన్న వాటిని పడేస్తూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొట్టె అశోక్, వార్డ్ సభ్యులు మడావి వర్ణవతి, మల్టీ పర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత కాలనీల్లో ముమ్మర పారిశుధ్య పనులు



**గుడిహత్నూర్:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జలమయమైన గుడిహత్నూర్ గ్రామంలోని కాలనీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ఆడే శీల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచే పనులు చేపట్టారు. భారీ వర్షాల అనంతరం మహంకాళి గల్లీలో ముంపు బాధితులను పరామర్శించిన సర్పంచ్, శుక్రవారం వాతావరణం అనుకూలించడంతో వెంటనే పారిశుధ్య పనులను ప్రారంభించారు. లింగాపూర్ రోడ్, సోనార్ గల్లీల్లో పూడికతో నిండిపోయిన నాళాలను గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి స్వయంగా పర్యవేక్షిస్తూ పూడికతీత పనులు నిర్వహించారు. ఇటీవల సర్పంచ్ చొరవతో రవీంద్ర నగర్, ఎక్రోస్డ్ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన కొత్త కచ్చా నాళాలతో ఈసారి వరద నీటి ప్రవాహం సాఫీగా జరిగి, ముంపు తీవ్రత గణనీయంగా తగ్గిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఎంఐఎం మండల అధ్యక్షుడు అర్షద్ ఖురేషి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షా నికి కూలిన ఇల్లు



**జైనూర్:** మండలంలోని లక్ష్మణ్ పటేల్ గూడ గ్రామంలో కురిసిన భారీ వర్షాలతో ఆడా మోహన్కు చెందిన ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ ఘటనలో అదృష్ట వశాత్తూ కుటుంబ సభ్యులెవరూ గాయపడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా ఇంట్లో ఉన్న బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, గృహోపకరణాలు వర్షపు నీటిలో తడిసి పూర్తిగా పాడయ్యాయి. నివాసం కోల్పోయిన ఆ కుటుంబం ప్రస్తుతం ఉండటానికి ఆశ్రయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తాము ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇల్లు ఒక్కసారిగా కూలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని బాధితుడు ఆడా మోహన్ ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు సందర్శించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం, ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన సాయం అందించాలని విజ్ఞప్తి చేశాడు.

## పెండింగ్ సీఎంఆర్ సరఫరా వెంటనే పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**మంచిర్యాల:** జిల్లాలో పెండింగ్లో ఉన్న సీఎంఆర్ సరఫరాను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని ఎస్ఆర్ఎం రైస్ మిల్లును మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో పెండింగ్లో ఉన్న సీఎంఆర్ సరఫరా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించడం ప్రతి రైస్ మిల్లర్ బాధ్యత అని స్పష్టం చేశారు. పెండింగ్లో ఉన్న సీఎంఆర్ సరఫరాను వేగవంతం చేసి ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. సీఎంఆర్ సరఫరా విషయంలో నిర్లక్ష్యానికి తావు లేదని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## భారీ వర్షా లకు పెంకుటిల్లు కూలి నిరాశ్రయమైన కుటుంబం





**కెరమెరి:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తుమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలో భారీ వర్షాల ధాటికి ఓ నిరుపేద కుటుంబానికి చెందిన పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇంటి మట్టి గోడలు బలహీనపడి ఒక్కసారిగా పైకప్పుతో సహా నేలమట్టమయ్యాయి. దీంతో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తమై బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు తీవ్ర అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తి కావడంతో తన నివాసాన్ని కోల్పోయి తలదాచుకునే చోటు లేక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం కూలిపోయిన ఇంటి శిథిలాల వద్దే కుటుంబ సభ్యులతో కలిసి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఘటనపై స్థానికులు స్పందిస్తూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే ఆదుకోవాలని కోరారు. వెంటనే ఆర్థిక సాయం అందించడంతో పాటు

## ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు

**ఎమ్మెల్సీ దండే విఠల్**



**కాగజ్నగర్:** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మర్తిడి గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మర్తిడి గ్రామ ఉప సర్పంచ్ అప్పల శ్రీనివాస్, వార్డు సభ్యులు, దుర్గం బిబిన్, రాంటెంకి దిలీప్, దుర్గం డోనాజీ, తాళ్లపల్లి ప్రకాష్, చిప్పకుర్తి మహేష్, దుర్గం శివకృష్ణ, సుందిళ్ల లవేష్తో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మర్తిడి గ్రామ సర్పంచ్ మల్లేష్, ఉత్స రంగపల్లి సర్పంచ్ ఎనుక శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరామ్, రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు బుస శంకర్, ఉమ్మెర సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడి వైద్య ఖర్చులకు రూ.1.27 లక్షల విరాళాలు..

### ఫేస్‌బుక్ పిలుపుతో కదిలిన దాతల హృదయాలు





ధర్మపురి పట్టణంలో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఓ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలను అందుకుంటోంది. సామాజిక మాధ్యమాల ద్వారా చేసిన ఒక చిన్న విజ్ఞప్తి పెద్ద ఉద్యమంగా మారి, తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లోని ప్రవాస భారతీయులను సైతం కదిలించింది. ఆర్థికంగా చితికిపోయి వైద్య చికిత్సకు నోచుకోలేని నిరుపేద బాధితుడి కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.1.27 లక్షల విరాళాలను సమకూర్చారు. ఈ సహాయంతో ఆ కుటుంబంలో మళ్లీ ఆశాకిరణాలు వెలుగు చూశాయి.

ధర్మపురి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న నూగురి సత్యనారాయణ గతంలో చిన్న హోటల్ నిర్వహిస్తూ తన కుటుంబాన్ని పోషించేవాడు. శ్రమనే నమ్ముకుని జీవనం సాగించిన ఆయనకు మధుమేహం తీవ్రరూపం దాల్చడంతో నాలుగేళ్ల క్రితం ఎడమ కాలును వైద్యులు తొలగించాల్సి వచ్చింది. ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే మూడు నెలల క్రితం పక్షవాతం రావడంతో ఒక చేయి, నడుము భాగం పనిచేయకుండా పోయాయి. దీంతో ఆయన పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు.

కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న వ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది.

సత్యనారాయణ భార్య విజయ బీడీలు చుడుతూ వచ్చే స్వల్ప ఆదాయంతోనే కుటుంబ పోషణతో పాటు భర్త వైద్య ఖర్చులను భరించే ప్రయత్నం చేస్తోంది. రోజువారీ అవసరాలు తీర్చడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో మందులు, వైద్య పరీక్షలు, ఇతర చికిత్సల ఖర్చులు భరించడం ఆమెకు అసాధ్యంగా మారింది. కుటుంబ సభ్యులు, బంధువులు కూడా తమ వంతు సహకారం అందించినప్పటికీ, దీర్ఘకాలిక వైద్యానికి అవసరమైన నిధులు సమకూరక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

ఈ విషయం తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు, నిరంతరం అవసరమున్న నిరుపేదలకు అండగా నిలుస్తున్న రేణుకుంట రమేష్ జూలై 3న తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా సత్యనారాయణ పరిస్థితిని వివరించి, మానవతా దృక్పథంతో వైద్య సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన చేసిన పోస్టు అనేక మందికి చేరడంతో స్పందన ఊహించిన దానికంటే ఎక్కువగా వచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో నివసిస్తున్న ఎన్నారైలు, సామాజిక సేవాభిలాషులు, దాతలు తమ వంతు బాధ్యతగా భావించి బాధితుడి భార్య విజయ బ్యాంకు ఖాతాకు నేరుగా విరాళాలు జమ చేశారు. కొద్దిరోజుల్లోనే మొత్తం రూ.1.27 లక్షలు సమకూరడం విశేషం.

సమకూరిన విరాళాలను శుక్రవారం స్థానిక సీఐ రాం నర్సింహారెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాధవరావు సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు దాతల సేవాభావాన్ని అభినందిస్తూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ప్రతి దాతకు, సామాజిక సేవకుడు రేణుకంట రమేష్‌కు, సహకరించిన పోలీసు, బ్యాంకు అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాలను సానుకూలంగా వినియోగిస్తే అవి ప్రాణాలను కాపాడే సేవా వేదికలుగా మారగలవని మరోసారి నిరూపించింది. చిన్న సహాయం కూడా పెద్ద మార్పునకు కారణమవుతుందనే సందేశాన్ని ఈ ఘటన సమాజానికి అందించింది. అపరిచితుల బాధను తమ బాధగా భావించి ముందుకు వచ్చిన దాతల ఉదారత మానవత్వానికి ప్రతీకగా నిలిచింది. ఆర్థికంగా బలహీన వర్గాలకు సమాజం అండగా నిలిస్తే ఎన్నో కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని, సేవా భావం, దాతృత్వం, సామాజిక బాధ్యత కలిసొస్తే ఎలాంటి కష్టాలనైనా అధిగమించవచ్చని ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**

# పంట మార్పిడి విధానంతోనే రైతులకు అధిక లాభాలు

- తుమ్మిడిహెట్టిలో సాగు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హరిత
- వర్షా ల వేళ రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచన



**కౌటాల:** రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ప్రత్యామ్నాయ పంటల సాగుతో ఆర్థికంగా లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపు నిచ్చారు. శుక్రవారం కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి ప్రాంతంలో వ్యవసాయ పొలాల్లో జరుగుతున్న నాట్ల పరిస్థితిని పరిశీలించి, రైతు కూలీలతో మాట్లాడి సాగు వివరాలు అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, మెరుపులు, వరద ప్రవాహాలు ఉన్న సమయంలో పొలాల్లో పనిచేసే వేళ తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపికలో మెళకువలు పాటించాలని తెలిపారు. అధిక నీటి అవసరం ఉండే వరి పంట స్థానంలో తక్కువ నీటితో సాగయ్యే పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.జిల్లాలో కొందరు రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ వరితో పాటు పత్తి, మిరప వంటి పంటలను సాగు చేస్తూ నమూనాగా నిలుస్తున్నారని, ఇటువంటి పంట వైవిధ్యీకరణ ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అంతర్ పంటలను ప్రోత్సహించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేసేలా అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు సమక్షంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి అనంతరం అనుమానాస్పద నమోదులపై సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందులో పేర్కొన్న ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును కొనసాగించుకోవచ్చని స్పష్టం చేశారు. డబుల్ ఎంట్రీలు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారి ఓట్లను ఎన్నికల నిబంధనల మేరకు తొలగిస్తామని పేర్కొన్నారు. ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో బూత్ స్థాయి అధికారులకు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నకిలీ నోట్ల ముఠా బట్టబయలు



## ఏడుగురు అరెస్ట్

**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ రూ.500 నోట్లను అసలైనవిగా చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 59 నకిలీ రూ.500 నోట్లు, ఏడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 21న కందుకూరు గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారికి రూ.18వేల నగదు ఇచ్చి, అదే మొత్తాన్ని ఫోన్పే ద్వారా తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం ఆ నగదులో 18 నకిలీ రూ.500 నోట్లు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు గుర్తించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టి జూలై 30న ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేశారు. దర్యాప్తులో లారీ డ్రైవర్ మారం రమేష్, అతని సోదరుడు మారం మహేష్, సార్నాలా రవీంద్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ కరెన్సీ ముఠాతో సంబంధాలు ఏర్పరుచుకున్నట్లు వెల్లడైంది. మధ్యవర్తుల ద్వారా ప్రధాన నిందితుడు జుజ్జవరపు రవి వద్ద నుంచి రూ.1లక్ష అసలు నోట్లకు బదులుగా రూ.2.10 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లను తీసుకుని సత్తుపల్లి, వేంసూరు, ఆంధ్ర ప్రాంతాల్లో అసలు నోట్లతో కలిపి చెలామణి చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జుజ్జవరపు రవి గతంలో మంచిర్యాల జిల్లా లక్షట్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీ కేసులో అరెస్టై బెయిల్పై బయటకు వచ్చినప్పటికీ, మళ్లీ ఇదే నేరానికి పాల్పడినట్లు తెలిపారు. అలాగే కాకినాడకు చెందిన కొవ్వూరి వినోద్ సతీష్ కుమార్ రెడ్డి గతంలో కూడా నకిలీ కరెన్సీ కేసులో అరెస్టై జైలుకు వెళ్లినప్పటికీ, తిరిగి నకిలీ నోట్ల సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వివరించారు.

# తొమ్మిది నెలలుగా మురుగునీటి శుద్ధి కేంద్రం బంద్..

- 6,240 కుటుంబాలకు నరకయాతన
- దుర్వాసన, దోమలతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్ఆర్ఆర్టీఆర్వీ సామాజిక సేవా సంస్థ డిమాండ్
- 6,240 కుటుంబాల ఆరోగ్యంతో చెలగాటం

**నాగారం :**
రాంపల్లి ద్విగృహాల కాలనీలో గత తొమ్మిది నెలలుగా మురుగునీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో 6,240 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆర్ఆర్ఆర్టీఆర్వీ సామాజిక సంక్షేమ సంస్థ డైరెక్టర్ వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన మాట్లాడుతూ, గతంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమయంలో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణ సక్రమంగా సాగేదని, అనంతరం కాలనీ మహానగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చిన తర్వాత సంబంధిత అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.మురుగునీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, క్రిమికీటకాలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా 21, 25, 34, 36 బ్లాకుల పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనారోగ్య బారిన పడే ప్రమాదం నెలకొందని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వెంకట్ విమర్శించారు. వెంటనే మురుగునీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని మీడియా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.



# గీతంలో ఘనంగా అచీవర్స్ డే వేడుకలు

## విజేతలకు నియామక పత్రాల అందజేత

**హైదరాబాద్ :**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ప్రాంగణ నియామకాలు, ఉన్నత విద్యలో విద్యార్థులు సాధించిన అద్భుతమైన విజయాలను గుర్తిస్తూ, శుక్రవారం అచీవర్స్ డే 2026ను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంది. వృత్తి మార్గదర్శక కేంద్రం (కెరీర్ గైడెన్స్ సెంటర్ – సీజీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, విద్యా నైపుణ్యం, పరిశ్రమకు సన్నద్ధత, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి పట్ల విశ్వవిద్యాలయానికి ఉన్న బలమైన నిబద్ధతను ప్రతిబింబించింది.ఈ సందర్భంగా, 2026లో గ్రాడ్యుయేట్ అయ్యే బ్యాచ్ కు సంబంధించిన ప్రాంగణ నియామక ఫలితాలను గీతం ప్రకటించింది. జూలై 2026 నాటికి, ప్రాంగణ నియామకాలను ఎంచుకున్న 1,347 మంది విద్యార్థులలో 771 మంది (60 శాతం) ప్లేస్ మెంట్లు సాధించారు. విశ్వవిద్యాలయంలోని ఏడు స్కూళ్లలో 324 ప్రముఖ నియామక సంస్థల ద్వారా వెయ్యికి పైగా ఉద్యోగ ఆఫర్లు అందించారు.గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) 97.5 శాతం ఓవరాల్ ప్లేస్ మెంట్ రేటుతో అగ్రగామిగా నిలిచింది. ఇది అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో వంద శాతం, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయిలో 95.8 శాతం ప్లేస్ మెంట్లను సాధించింది. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (జీఎస్ఏ) కూడా వంద శాతం ప్లేస్ మెంట్లను నమోదు చేసింది. స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు 6.94 లక్షల వార్షిక ప్యాకేజీతో అత్యధిక సగటును సాధించగా, గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 544 ఉద్యోగ ఆఫర్లతో, 443 మంది విద్యార్థుల ప్రాంగణ నియామకాలతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ సీజన్ లో అత్యధికంగా 16 లక్షల రూపాయల వార్షిక జీతం ప్యాకేజీని గీతం విద్యార్థులు సాధించారు.ఈ కార్యక్రమానికి పీడబ్ల్యూసీ ఏసీ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆపరేషన్స్ లీడర్ (టాక్స్) జీ.టీ. కృష్ణ చైతన్య, టీసీఎస్ ప్రాంతీయ అధిపతి (అకడమిక్ అలయన్సెస్) రిచర్డ్ కింగ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నిరంతర అభ్యాసం, ఆవిష్కరణ, వృత్తిపరమైన నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులను వారు ప్రోత్సహించారు. విజేతలకు కెరీర్ ఫుల్ ఫిల్ మెంట్ సర్టిఫికెట్లను అందజేశారు.తొలుత, స్వాగతోపన్యాసంలో గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు మాట్లాడుతూ, “గీతం విద్యా ప్రమాణాలు, కెరీర్–సిద్ధత కార్యక్రమాలపై పరిశ్రమకు ఉన్న నిరంతర విశ్వాసాన్ని ఈ ఏడాది ప్లేస్ మెంట్ సీజన్ ప్రతిబింబిస్తోంది. వెయ్యికి పైగా ఉద్యోగ ఆఫర్లు, 16 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో, మా విద్యార్థులు పోటీతో కూడిన ప్రపంచ ఉద్యోగ మార్కెట్ లో రాణించగల తమ సామర్థ్యాన్ని మరోసారి ప్రదర్శించారు. పరిశ్రమ భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి, మా విద్యార్థులకు మరిన్ని కెరీర్ అవకాశాలను కల్పించడానికి మేము కట్టుబడి ఉన్నాం” అని అన్నారు.విజేతలైన జి.సృజన్ (సీఎస్ఈ), డి.వీణాశ్రీ (సీఎస్ఈ–ఏఐఎంఎల్), ఇ.జె.సంఘమిత్ర (ఈఈసీఈ), నిహారిక నోముల (ఎంబీఏ), పమిశెట్టి ప్రేమ్ కుమార్ (ఎమ్మెస్సీ డేటా సైన్స్) తమ ప్లేస్ మెంట్ అనుభవాలను, విజయ గాథలను పంచుకున్నారు. తల్లిదండ్రుల తరపున జి.సృజన్ తండ్రి ఎన్.వి. శ్రీనివాస్ స్వరూప్, విశ్వవిద్యాలయ విద్యా వ్యవస్థను, కెరీర్ మార్గదర్శకత్వాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, అధ్యాపక సభ్యులు, విభాగాధిపతులు, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు తదితరులు హాజరయ్యారు. వీరిలో డాక్టర్ రమేష్ వడ్డి, ప్రొఫెసర్ జి.శివకుమార్, డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, డాక్టర్ మోతహర్ రెజా, డాక్టర్ బందన్ కుమార్ మిశ్రా, డాక్టర్ శామ్యూల్ థరు, కెరీర్ గైడెన్స్ సెంటర్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఎడ్విన్ ఆంథోనీ, డైరెక్టర్ డాక్టర్ కె.మమత కూడా ఉన్నారు.

# స్మశానవాటికలో మౌలిక వసతుల మెరుగుదలకు ఎమ్మెల్యే చర్యలు

**మిర్యాలగూడ**
పట్టణంలోని హిందు స్మశానవాటిక పరిసరాల్లో చెట్లు అధికంగా ఉండటం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో మాట్లాడి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్మశానవాటిక పరిసరాలను ప్రతిరోజూ మున్సిపల్ కార్మికులతో శుభ్రపరచాలని, పరిశుభ్రమైన వాతావరణం నిరంతరం కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యేకు సొంత ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు అద్దె ఇళ్లలో నివసిస్తూ, కుటుంబ సభ్యుల మరణానంతరం అంత్యక్రియల సమయంలో తాత్కాలికంగా ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో బీఎల్ఆర్ సోదరుల సేవా సంస్థ మరియు రైస్ మిల్లర్స్ యజమానుల సంఘం సహకారంతో హిందూ స్మశానవాటిక ప్రాంగణంలో రెండు విశ్రాంతి గదులను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రకటించారు. సొంత ఇళ్లు లేని కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయిన సమయంలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఆ విశ్రాంతి గదులను వినియోగించుకునేలా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో చేపడుతున్న ఈ కార్యక్రమం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కొనాయిపల్లి లో "వన మహోత్సవం "

## మొక్కలు నాటిన సర్పంచ్ మన్నే కళ్యాణ్ ముదిరాజ్....



**మనోహరబాద్ :**
మెదక్ జిల్లా మనోహరబాద్ మండలంలోని కోనాయిపల్లి (పిటి )గ్రామంలో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్ ముదిరాజ్ ,ఉప సర్పంచ్,గ్రామస్తులతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో గ్రామస్థుల తో కలిసి 300 మొక్కలను నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ మన్నే కళ్యాణ్ ముదిరాజ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ లో భాగంగా , గ్రామాన్ని హరితమయంగా మార్చడమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గ్రామంలో మొత్తం 5,000 మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని. అందులో భాగంగానే నేడు ఈ కార్యక్రమం నిర్వహించామని వెల్లడించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను పాలకవర్గం,గ్రామస్థులందరూ తీసుకోవాలని, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, ఉప సర్పంచ్ శ్రవణ్ కుమార్, గ్రామస్తులు నరేందర్ గౌడ్, బాలమల్లేష్, గురుదాస్,పంచాయతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బ్రాడ్ పీక్‌లో మంచు చరియలు.. నిర్మల్ పుర్జా గల్లంతు

**నేషనల్ డెస్క్ :**

పాకిస్థాన్‌లో ఉన్న బ్రాడ్ పీక్ పర్వతం బేస్ వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం రోజు బ్రాడ్ పీక్‌పై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ ఘటనలో పది మంది పర్వతారోహకులు అదృశ్యమయ్యారు. అయితే శుక్రవారం పాకిస్థాన్ ఆర్మీ సుమారు నలుగురి మృతదేహాలను గుర్తించింది. ఇంకా ఆరుగురు పర్వతారోహకుల ఆచూకీ దొరకలేదు. పాకిస్థాన్‌లోని కరకోరమ్ పర్వత శ్రేణుల్లో కే2గా పిలువబడే బ్రాడ్ పీక్ పర్వతం ఉన్నది. ఆ శిఖరం ఎత్తు 8,047 మీటర్లు.మృతిచెందిన పర్వతారోహకుల్లో.. ప్రఖ్యాత నేపాలీ మౌంటనీర్ నిర్మల్ పుర్జా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మిస్సైన వారిలో ఆరుగురు నేపాలీ క్లైంబర్స్, ఓ పాకిస్తానీ, ఓ ఒమన్ దేశస్తుడు, ఓ అమెరికన్, చైనా క్లైంబర్ ఉన్నట్లు ఆల్‌పైన్ క్లబ్ ఆఫ్ పాకిస్థాన్ ప్రకటించింది. ప్రస్తుతం ఆచూకీ లేని ఆరుగురు మృతదేహాల కోసం గాలింపు, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 14 అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన రికార్డు నిర్మల్ పుర్జా పేరిట ఉన్నది. ఆయన వయసు 43 ఏళ్లు.బేస్ క్యాంప్ వద్ద విరిగిపడ్డ కొండచరియలు సుమారు వెయ్యి మీటర్ల కిందకు నెట్టుకెళ్లాయని, దీంతో అక్కడ ఉన్న క్లైంబర్స్ ఆ శిథిలాల్లో ట్రాప్ అయినట్లు జీపీఎస్ లొకేషన్ ద్వారా తెలుస్తోందని అధికారులు చెబుతున్నారు. నిర్మల్ పుర్జా




జీపీఎస్ ట్రాకర్ ఇంకా కదులుతోందని ఓ నిపుణుడు పేర్కొన్నాడు. కొండచరియలు విరిగిపడిన తర్వాత రికార్డు అయిన లొకేషన్ నిత్యం మారుతూ వస్తోందన్నారు. నిజానికి పుర్జా ఆచూనీ చిక్కకపోయినా.. అతని జీపీఎస్ కదులుతున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచంలో 8వేల మీటర్ల ఎత్తు దాటిన 14 పర్వతాలను పుర్జా మూడు సార్లు ఎక్కేశాడు. ఇక సెవన్ సమ్మిట్స్‌ను మూడు సార్లు అధిరోహించాడు. నేపాలీ మౌంటనీరింగ్ సంఘం అతని ఆచూకీ కోసం ఎదురుచూస్తోంది.

# గాల్వాన్ తర్వాత భారత్‌కు రానున్న జిన్‌పింగ్



**నేషనల్ డెస్క్ :**

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో ఇండియా రానున్నారు. వచ్చే సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగి బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే, ఇండియాచైనాల మధ్య జరిగిన గాల్వాన్ ఘర్షణ తర్వాత జిన్‌పింగ్ ఇండియాలో పర్యటించనుండటం తొలిసారి అవుతుంది. 2020లో జరిగిన ఈ ఘర్షణ తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు పాక్షికంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనుంది. ఈ రెండు రోజులపాటు జిన్‌పింగ్ ఇండియాలో పర్యటిస్తారు. భారత్‌చైనాల మధ్య సంబంధాల బలోపేతానికి జిన్‌పింగ్ రాక ఎంతగానో ఉపయోగపడుతుందనేది విశ్లేషకుల అభిప్రాయం. జిన్‌పింగ్ 2013 నుంచి చైనాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ పదమూడేళ్లలో జిన్‌పింగ్ మూడుసార్లు మాత్రమే ఇండియాలో పర్యటించారు. చివరిసారిగా 2019, అక్టోబర్‌లో ఇండియాకు వచ్చారు. ఆ తర్వాత 2020 నుంచి సరిహద్దు (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ)) విషయంలో వివాదం చెలరేగడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో చైనా, ఇండియా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇందుకోసం ముందుగా చైనాతో చర్చించేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో పర్యటించే అవకాశం ఉంది. అక్కడి అగ్రనేతలతో అజిత్ దోవల్ ఉన్నతస్థాయి చర్చలు జరుపుతారు. ఈ చర్చలు సానుకూలంగా ఉంటే.. జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా ఢిల్లీలో మోదీతోపాటు భారత అగ్రనాయకులతో కూడా ఆయన చర్చించే అవకాశం ఉంది. బ్రిక్స్ సదస్సుకు పలు దేశాధినేతలు కూడా హాజరవుతారు. మరోవైపు ఇటీవల చైనాపై, ఇండియాపై అమెరికా తీవ్ర ఆంక్షలు, టారిఫ్‌లు విధిస్తున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య చర్చలు కీలకం కానున్నాయి.

# ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరా.. ఆమ్నెస్టీ రిపోర్ట్

**నేషనల్ డెస్క్ :**

గాజా యుద్ధం కోసం భారతీయ కంపెనీలు సుమారు 2596 ఆయుధ షిప్‌మెంట్లను ఇజ్రాయల్‌కు పంపినట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొన్నది. గురువారం దీనికి సంబంధించిన రిపోర్టును రిలీజ్ చేసింది. ఇండియా నుంచి ఇజ్రాయెల్‌కు సుమారు 2500పైగా ఆయుధాలను సరఫరా చేసినట్లు ఆ నివేదికలో వెల్లడించారు. దీని వల్ల గాజాలో మారణహోమం పెరిగే అవకాశాలు ఉన్నట్లు కూడా రిపోర్టులో అభిప్రాయపడ్డారు. 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి వివిధ కంపెనీలు భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు ఆయుధాలను సరఫరా చేసినట్లు రిపోర్టులో వెల్లడించారు. పాలస్తీనియన్లపై మారణహోమం జరిగే అవకాశాలు ఉన్నా.. భారత్ మాత్రం తమ ఆయుధాలను ఇజ్రాయెల్‌కు అందజేస్తున్నట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొన్నది.ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని ఇజ్రాయెల్‌కు పంపడం వల్ల.. ఆ దేశంతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. షిప్మెంట్ స్థాయి వాణిజ్యానికి చెందిన డేటాను రిపోర్టులో రిలీజ్ చేశారు. భారత కంపెనీలు తమ ఆయుధాలను, అమ్యూనిషన్, విడిభాగాలను ఇజ్రాయిలీ కంపెనీలకు షిప్పింగ్ చేసినట్లు రిపోర్టులో పేర్కొన్నారు. ఆ ఇజ్రాయిలీ కంపెనీలు ఆ దేశ మిలిటరీకి ఆ ఆయుధాలను సరఫరా చేస్తాయి. ఇజ్రాయిలీ మిలిటరీ, డిఫెన్స్ రంగానికి ఇండియా సహకరిస్తున్నట్లు మా అధ్యయనంలో తేలిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కల్లామార్డ్ తెలిపారు.ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, అమ్యూనిషన్‌ను సరఫరా చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని భారత ప్రభుత్వాన్ని కోరినట్లు నివేదికలో తెలిపారు. 2596 షిప్మెంట్లలో భాగంగా సుమారు 3,90,516 మిలిటరీ గ్రేడ్ స్మాల్ ఆర్మ్స్ పార్ట్స్, 5,64,970 ఎక్స్‌ప్లోజివ్ ఆర్డినాన్స్ ఉన్నాయి. వీటిల్లో డ్రోన్ వార్‌హెడ్స్, ఆర్టిల్లరీ షెల్స్ కేసింగ్స్ ఉన్నాయి. మిలిటరీ వెహికిల్స్‌కు చెందిన 298 కాంపోనెంట్స్ కూడా సరఫరా జాబితాలో ఉన్నాయి. 155 ఎంఎం హై ఎక్స్‌ప్లోజివ్ ఆర్టిల్లరీ షెల్స్‌ను ఎల్బిట్ సిస్టమ్స్‌కు సరఫరా చేస్తుంది. పీఎల్ఆర్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, కళ్యాణి సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు భారత్ నుంచి ఆయుధాలను సరఫరా చేశాయి. ఎల్బిట్ సిస్టమ్స్, రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్, ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు చెందిన ఇజ్రాయిలీ కంపెనీలకు సామాగ్రిని సరఫరా చేశారు.



# ఒంటెను ఢీకొట్టిన ఎస్‌యూవీ.. ఆర్మీ మేజర్ మృతి

**నేషనల్ డెస్క్ :**

ఆర్మీ అధికారులు ప్రయాణించిన ఎస్‌యూవీ వాహనం ఒక ఒంటెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వాహనం పల్టీలుకొట్టింది. ఆర్మీ మేజర్ మరణించగా ఇద్దరు ఆర్మీ అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో ఆర్మీ మేజర్ హంజా ఆరిఫ్, డ్యూటీ ముగిసిన తర్వాత ఇద్దరు తోటి అధికారులతో కలిసి ఎస్‌యూవీలో ఆర్మీ స్టేషన్‌కు వెళ్తున్నారు. ఉన్నట్టుండి రోడ్డుపైకి ఒక ఒంటె రావడంతో ఆ వాహనం బలంగా దానిని ఢీకొట్టింది. ఆర్మీ వాహనం బోల్తాకొట్టి పలుమార్లు పల్టీలు కొట్టింది.కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే సహాయక బృందాలు, సైనిక సిబ్బంది ప్రమాద స్థలానికి హుటాహుటిన చేరుకోవడంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ఆర్మీ అధికారులను థైయత్‌లోని ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. మేజర్ హంజా ఆరిఫ్ మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. గాయపడిన లెఫ్టినెంట్ ఆయుష్మాన్, లెఫ్టినెంట్ అభినవ్ రాథోర్‌కు చికిత్స అందిస్తున్నారు. ఒంటె కూడా అక్కడికక్కడే చనిపోయిందని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ ప్రమాదంలో మరణించిన ఆర్మీ మేజర్ హంజా



ఆరిఫ్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ఆర్మీ అధికారులు తెలిపారు. నెల రోజుల క్రితమే ఆయనకు వివాహం జరిగినట్లు చెప్పారు. స్థానిక పోలీసులు, మిలిటరీ సంయుక్తంగా ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# అయోధ్య స్కిట్.. అతిథి పాత్రలో రాహుల్




**నేషనల్ డెస్క్ :**

దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన అయోధ్య రామాలయం విరాళాల చోరీ విషయంలో విపక్షాలు ఆందోళనలను తీవ్రం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో భాగంగానే స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ (పప్పు యాదవ్) పార్లమెంట్ ఆవరణలో వినూత్న స్కిట్ ప్రదర్శించారు. కాషాయ వస్త్రాలు ధరించి, ఓ సన్యాసి వేషంలో వచ్చిన ఆయన.. పార్లమెంట్ పరిసరాల్లో కూర్చొని విరాళాలు సేకరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు రుచి వీరా (మొరదాబాద్), అవధేశ్ ప్రసాద్ (అయోధ్య) కూడా ఈ స్కిట్‌లో నటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అతిథి పాత్రలో కనిపించారు. ఆయన కొంత మొత్తాన్ని హుండీలో వేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ కూడా తమ వంతుగా విరాళాలు ఇచ్చారు. అలా పలువురు ఎంపీలు ఇచ్చిన విరాళాలతో ఆ సన్యాసి ఉడాయిస్తాడు. అది గమనించిన ఎంపీలు అతడిని పట్టుకొన్ని దేహశుద్ధి చేసినట్లు నటిస్తారు. అక్కడితో స్కిట్ ముగుస్తుంది.దీనిపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ..'' ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ జరిగింది. దీనిపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ నీట్ పేపర్ లీక్ అంశంపై ఉభయసభల్లోనూ ఆందోళనలు రేగడంతో ఈ విషయం చర్చకు రాలేదు. దీనిపై చర్చ చేపట్టాలని నేను కూడా పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి నోటీసులు ఇస్తూనే ఉన్నాను. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే, పప్పు యాదవ్ ఆలోచనతో ఈ స్కిట్ చేశాం'' అని అన్నారు. లోక్‌సభలో పప్పు యాదవ్ కాషాయ వస్త్రధారణ అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభకు ఇలా రావడం సరికాదన్నారు. ఆయన పేరు ప్రస్తావించకుండానే 'సభకు విభిన్న వేషధారణలతో వచ్చే సభ్యులకు..' అంటూ మందలించారు.

# పీవోకేలో దాడులు.. తీవ్రంగా స్పందించిన భారత్



**నేషనల్ డెస్క్ :**

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని పౌరులపై పాక్ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని భారత్ మండిపడింది. దీనిని అంతర్జాతీయ సమాజం గమనించి.. పాక్‌ను జవాబుదారీ చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మాట్లాడారు. పీవోకేలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దీనిపై జయస్వాల్ తీవ్ర స్థాయిలో స్పందించారు. సామాన్య పౌరుల పట్ల పాక్ సైన్యం నిరంకుశంగా ప్రవర్తిస్తోందని ఆక్షేపించారు. పీవోకేలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారని, ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసిందని అన్నారు. మరోవైపు భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చిందని జయస్వాల్ అన్నారు. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంతం దేశంపై గురిపెట్టారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. హింస పేట్రేగిపోవడంతో అంతర్జాతీయ సంస్థలు స్వతంత్ర దర్యాప్తు చేయాలని అక్కడి ప్రజలే కోరుకుంటున్నారని చెప్పారు. జీవన వ్యయాలు పెరగడం, పరిపాలనపరమైన సమస్యలు, మైనార్టీలపై రాజకీయ వివక్ష తదితర అంశాలకు నిరసనగా గత నెల నుంచి పీవోకేలో ఆందోళనలు మిన్నంటుతున్న సంగతి తెలిసిదే. ది జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) దీనికి నాయకత్వం వహిస్తోంది.

# కూలిన నాలుగంతస్తుల భవనం.. 8 మంది మృతి

**నేషనల్ డెస్క్ :**



మహారాష్ట్రలోని భివండీలో నాలుగంతస్తుల భవనం కూలింది. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. ప్రమాదం జరిగిన భవనంలో ఒక్కో అంతస్తులో 12 చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో .. అందులోని వారంతా శిథిలాల కింద చిక్కుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే స్పందించిన స్థానికులు పలువురిని రక్షించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ భవనంలో పగుళ్లు ఏర్పడడంతో.. దానిని ఖాళీ చేయాల్సిందిగా అక్కడి వారికి ఇదివరకే సూచించినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ వారు ఖాళీ చేయకుండా అనధికారికంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులేనని చెప్పారు.

చురకలు



## మా ఏఐ 3 కంపెనీలను హ్యాక్ చేసింది: ఆంథ్రోపిక్




**బిజినెస్ డెస్క్ :**

క్లాడ్ చాట్‌బాట్ సృష్టికర్త, ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ సంచలన విషయాన్ని బయటపెట్టింది. టెస్టింగ్ దశలో ఉన్న తమ ఏఐ మోడళ్లు పొరపాటున మూడు ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లలోకి ప్రవేశించి హ్యాక్ చేశాయని ప్రకటించింది. తమ ఏఐ వ్యవస్థ ఇంకో ఏఐ కంపెనీ మోడల్‌ను హ్యాక్ చేసిందని చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. తాము కూడా అప్రమత్తమై సైబర్‌సెక్యూరిటీ సమీక్ష చేపట్టినట్లు తెలిపింది. రికార్డులు పరిశీలిస్తుండగా.. ఈ ఏడాది ప్రారంభంలో హ్యాకింగ్ జరిగినట్లు గుర్తించామంది. హ్యాంకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను తాము ఇప్పటికే సంప్రదించామని ఆంత్రోపిక్ వెల్లడించింది. అయితే వాటి వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల వాటి మౌలిక సదుపాయాలను క్లాడ్ దెబ్బతీసిందని పేర్కొంది. ఇది దురుద్దేశంతో చేసిన పని కాదని.. ఒక మోడల్ సామర్థ్యం ఏమిటో తెలియాలంటే దానిని విడుదల చేయడానికి ముందు భద్రతా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. ఆ సమయంలో అనుకోకుండా ఈ సైబర్ భద్రత ఘటన చోటుచేసుకున్నట్లు వివరించింది. దీంతో అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు ఏర్పడవచ్చన్న అనుమానాలువ్యక్తమవుతున్నాయి.

## ఫ్లిప్‌కార్ట్ వినియోగదారులకు నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్ ఫ్రీ!




**బిజినెస్ డెస్క్ :**

ప్రముఖ ఇకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్.. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌తో జట్టు కట్టింది. తన ప్లస్ లాయల్టీ మెంబర్లకు నెట్‌ఫ్లిక్స్ మొబైల్‌ప్లాన్‌ను ఉచితంగా అందించనుంది. నెలవారీ షాపింగ్ ఆధారంగా ఈ రివార్డును ఇవ్వనుంది. ఆగస్టు 1 నుంచి కొత్త రివార్డు ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. ఒక క్యాలెండర్ నెలలో నాలుగు సార్లు రూ.299, లేదా అంతకంటే ఎక్కువ మొత్తం షాపింగ్ చేసిన వినియోగదారులకు ఈ మొబైల్ ప్లాన్ ఉచితంగా లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో ఆర్డర్లకు ఇది వర్తిస్తుంది. నాలుగో ఆర్డర్ పూర్తయిన నాటి నుంచి 30 రోజుల పాటు మొబైల్ ప్లాన్ చెల్లుబాటు అవుతుంది.ఆ తదుపరి నెల కూడా నిర్ణీత ఆర్డర్ల విలువ దాటగానే నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను అన్‌లాక్ చేయొచ్చు. ప్రతి నెలా 4 ఆర్డర్లు పూర్తి చేయడం ద్వారా ఈ ప్రయోజనాన్ని ఉచితంగా కొనసాగించొచ్చు. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ సభ్యులు కానివారూ ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు. ఇందుకోసం 12 నెలల వ్యవధిలో 15 ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్లస్ మెంబర్‌షిప్‌కి అర్హత సాధిస్తారు. అయితే, మొబైల్ ప్లాన్‌లో ఒక మొబైల్/టాబ్లెట్‌లో ఏదో ఒకదాంట్లో మాత్రమే చూసేందుకు వీలవుతుంది. టీవీ లేదా ఇతర ప్లాన్‌లకు అప్‌గ్రేడ్ చేయడానికి కుదరదు. నెలలో4 ఆర్డర్లు పూర్తయ్యాక ఫ్లిప్‌కార్ట్ యాప్‌లోకి వెళ్లాలి. అక్కడ పై క్లిక్ చేసి, మీ ఫోన్ నంబర్ లేదా ఇమెయిల్ ఐడీ ద్వారా లాగిన్ అయ్యి ఆఫర్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.

## కోస్పి దూకుడు.. శాంసంగ్, SK హైనిక్స్ 23% జంప్

**బిజినెస్ డెస్క్ :**

దక్షిణకొరియా సూచీ కోస్పి భారీగా పుంజుకొంది. వరుసగా మూడు రోజుల పాటు నష్టాలు చవిచూసిన సూచీ.. శుక్రవారం పైకెగిసింది. దాదాపు 18 శాతం మేర లాభపడింది. ఒక్క రోజులో ఈ స్థాయిలో లాభపడి సరికొత్త రికార్డు సృష్టించింది. దాదాపు 17.91 శాతం లాభంతో.. వెయ్యికి పైగా పాయింట్లు ఎగబాకి 6,595.45 వద్ద ట్రేడవుతోంది. దక్షిణకొరియాకు చెందిన ప్రధాన కంపెనీలైన ఎస్‌కే హైనిక్స్, శాంసంగ్ షేర్లు కూడా 23 శాతానికి పైగా రాణించడం గమనార్హం.

**కారణాలు ఇవీ..**

అమెరికా మార్కెట్లు నిన్న లాభాల్లో ముగియడం ఆసియా మార్కెట్లలో కొత్త ఉత్సాహం నింపింది. ముఖ్యంగా టెక్నాలజీ, చిప్ స్టాక్స్ రాణించడం కోస్పికి కలిసొచ్చింది. దీనికితోడు అమెజాన్ మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించడం ఆసియా మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీ కండక్టర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కోస్పికి కలిసొచ్చింది. దక్షిణకొరియాకు చెందిన ప్రధాన కంపెనీలైన ఎస్‌కే హైనిక్స్, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ 23 శాతం చొప్పున రాణించాయి. తైవాన్ సెమీకండక్టర్ మానుఫ్యాక్చరింగ్ కంపెనీ కూడా 10 శాతానికి పైగా రాణించడంతో కోస్పి దూసుకెళ్లింది.గత కొన్ని రోజులుగా కోస్పి దాదాపు 17 శాతానికి పైగా పతనమైంది. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగడమూ దక్షిణ కొరియా సూచీ రాణించడానికి మరో ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సైతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి సెన్సెక్స్ 313 పాయింట్ల లాభంతో 78,241.25 వద్ద, 100 పాయింట్ల లాభంతో నిఫ్టీ 24,417 వద్ద కొనసాగుతోంది.

# 'ఆస్క్ గూగుల్ పే'.. ఎలా పనిచేస్తుంది?

**బిజినెస్ డెస్క్ :** ):

డిజిటల్ చెల్లింపులను మరింత సులభంగా మార్చే దిశగా గూగుల్ మరో కీలక అడుగు వేసింది. గూగుల్ పే యాప్‌లో "ఆస్క్ గూగుల్ పే" పేరుతో జెమినై ఆధారిత ఏఐ అసిస్టెంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. ఖర్చులపై ఏఐ విశ్లేషణ.. అడిగితే వెంటనే సమాధానం గూగుల్ పేలో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. టైప్ చేయడం లేదా వాయిస్ కమాండ్ ఇవ్వడం ద్వారా గతంలో చేసిన ఖర్చుల వివరాలను ఏఐ వెంటనే విశ్లేషించి సమాధానం ఇస్తుంది. ఉదాహరణకు.. గత నెలలో రెస్టారెంట్లలో ఎంత ఖర్చు చేశాను? ఈ వారం ఎక్కువగా డబ్బు ఎక్కడ ఖర్చయింది?నా నెలవారీ ఖర్చులను ఎలా నియంత్రించుకోవచ్చు? ఇలాంటి ప్రశ్నలకు వ్యక్తిగత లావాదేవీల ఆధారంగా సమగ్ర సమాధానాలు అందిస్తుంది.పొదుపు చిట్కాలు, పెట్టుబడి సూచనలు కూడా కేవలం ఖర్చుల వివరాలకే పరిమితం కాకుండా, ఈ ఏఐ అసిస్టెంట్ ఆర్థిక నిర్వహణకు ఉపయోగపడే సూచనలను కూడా ఇస్తుంది. నెలవారీ బడ్జెట్‌ను ఎలా ప్లాన్ చేసుకోవాలి, అవసరం లేని ఖర్చులను ఎలా తగ్గించాలి వంటి విషయాల్లో మార్గదర్శకత్వం అందిస్తుంది. అదనంగా..పెట్టుబడులపై సమాచారం, క్రెడిట్ స్కోర్‌కు సంబంధించిన వివరాలు, ప్రయాణాలు, షాపింగ్ సమయంలో అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు ఆఫర్లు,వంటి అంశాలను కూడా యాప్‌లోనే చూడొచ్చు. దీంతో వేరే యాప్‌లు ఉపయోగించాల్సిన అవసరం తగ్గుతుంది.




**10 భారతీయ భాషల్లో సేవలు..**

ఈ కొత్త ఏఐ ఫీచర్ ప్రస్తుతం 10 భారతీయ భాషలకు సపోర్ట్ చేస్తోంది. ప్రాంతీయ భాషల్లోనే ప్రశ్నలు అడిగి సమాధానాలు పొందే అవకాశం ఉండటంతో మరింత మంది వినియోగదారులు సులభంగా ఉపయోగించుకోగలుగుతారు. వాయిస్, టెక్స్ట్ రెండు విధానాల్లోనూ ఈ సేవలను వినియోగించవచ్చు.

**ఎస్‌బీఐతో కలిసి గూగుల్ పే ఫ్లెక్స్ కార్డ్**

గూగుల్, ఎస్‌బీఐ కార్డ్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకునిను కూడా పరిచయం చేసింది. ఈ క్రెడిట్ కార్డు రూపే, వీసా నెట్‌వర్క్‌లలో లభిస్తుంది. గూగుల్ పే యాప్ ద్వారానే ఎలాంటి పేపర్ డాక్యుమెంట్లు సమర్పించకుండా కొన్ని నిమిషాల్లో దరఖాస్తు చేసే అవకాశం కల్పించారు. ఈ కార్డుతో ప్రతి కొనుగోలుపై రివార్డ్స్ పొందవచ్చు. అలాగే అవసరమైతే క్రెడిట్ కార్డు బిల్లును ఈఎంఐగా మార్చుకునే సౌకర్యం కూడా ఉంటుంది.

**ప్రత్యేక ఆఫర్లు.. AI ప్లాన్‌పై డిస్కౌంట్**

గూగుల్ పే ఫ్లెక్స్ ఎస్‌బీఐ కార్డు తీసుకునే వినియోగదారులకు అదనపు ప్రయోజనాలను కూడా ప్రకటించారు. గూగుల్ ఏఐ ప్లస్ సబ్‌స్క్రిప్షన్‌పై ఒక సంవత్సరం పాటు 50 శాతం రాయితీ లభిస్తుంది. అంతేకాకుండా గూగుల్ పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ కొత్త సేవలతో గూగుల్ పే కేవలం చెల్లింపుల యాప్‌గా కాకుండా వ్యక్తిగత ఆర్థిక నిర్వహణకు ఉపయోగపడే సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా మారే దిశగా అడుగులు వేస్తోంది.

# మూడో రోజూ లాభాలతో ముగిసిన సూచీలు

**బిజినెస్ డెస్క్ :**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో వరుసగా మూడో రోజూ రాణించాయి. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. సెన్సెక్స్ 166 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన స్థిరపడింది.సెన్సెక్స్ ఉదయం 77,998.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,928.15) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు నష్టాల్లోకి జారుకున్న సూచీ.. తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 78,272.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 166.49 పాయింట్ల లాభంతో 78,094.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 66.45 పాయింట్ల నష్టంతో 24,383.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.41గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ లాభాల్లో ముగిశాయి. టీసీఎస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, టెక్ మహీంద్రా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4055 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# ఇన్స్యూరెన్స్ రంగంలోకి పతంజలి




**న్యూ ఢిల్లీ, జూలై31 :**

సుమారు రూ.4,500 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో పతంజలి 73.56 శాతం, డీఎస్ గ్రూప్ 24.5 శాతం వాటాను సొంతం చేసుకోనున్నాయి.ఆయుర్వేద ఉత్పత్తులు, ఎఫ్ఎంసీజీ రంగంలో వ్యాపారం నిర్వహిస్తున్న పతంజలి ఆయుర్వేద్ కొత్తగా ఇన్సూరెన్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. దీనికోసం మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేసేందుకు పతంజలి, డీఎస్ గ్రూప్‌కు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ఆమోదం తెలిపింది. సుమారు రూ.4,500 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో పతంజలి 73.56 శాతం, డీఎస్ గ్రూప్ 24.5 శాతం వాటాను సొంతం చేసుకోనున్నాయి. ప్రస్తుత వాటాదారుల నుంచి ఈ రెండు సంస్థలు కలిసి దాదాపు 98 శాతం వాటాను తమ నియంత్రణలోకి తీసుకోనున్నాయి. ఈ లావాదేవీని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఐఆర్‌డీఏఐ సూచించింది. కొత్తగా లైసెన్స్ కోసం దరఖాస్తు చేయకుండా, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న బీమా సంస్థను కొనుగోలు చేయడం ద్వారా పతంజలి నేరుగా ఇన్సూరెన్స్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అంతేకాకుండా, ఈ డీల్‌తో పతంజలి తొలిసారిగా ఆర్థిక సేవల రంగంలో అడుగుపెట్టు అయింది. మోటార్, ఆరోగ్య, ఆస్తి, వాణిజ్య బీమా విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ 202526లో రూ.3,615.48 కోట్ల స్థూల ప్రీమియం నమోదు చేసింది. దేశవ్యాప్తంగా ఏజెంట్లు, కార్పొరేట్ భాగస్వాములు, ఆటోమొబైల్ డీలర్లతో విస్తృత పంపిణీ వ్యవస్థ కూడా కంపెనీకి ఉంది. మరోవైపు, పతంజలికి గ్రామీణ, సెమీ అర్బన్ మార్కెట్లలో ఉన్న బలమైన పంపిణీ నెట్‌వర్క్‌ను బీమా వ్యాపార విస్తరణకు ఉపయోగించుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

**ఇన్సూరెన్స్ మార్కెట్‌లో గట్టి పోటీనిచ్చే అవకాశం..**

కాగా, ఆయుర్వేద ఉత్పత్తుల విక్రయంతో విపణిలోకి ఎంట్రీ ఇచ్చిన పతంజలి చాలా తక్కువ సమయంలోనే ఆదరణ పొందింది. దీంతో, కంపెనీ కొత్త కొత్త ఉత్పత్తులను చేర్చుకుంటూ వచ్చింది. పర్సనల్ కేర్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, ఇతర వినియోగ వస్తువుల ఉత్పత్తులకు విస్తరించింది. ప్రస్తుతం, మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో వాటా కొనుగోలు ద్వారా పతంజలి సంస్థ ఫైనాన్స్ విభాగంలో సైతం అడుగుపెట్టనుంది. బీమా వ్యాపారం కోసం పతంజలి తన రిటైల్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వినియోగించుకునే అవకాశమూ ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బీమా రంగంలోకి పతంజలి ఎంట్రీ ఇవ్వడంతో ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలకు గట్టి పోటీ ఎదురవ్వనుంది.

# పీవీసీ ధరలు పెంపు.. నిర్మాణ వ్యయం భారం

**న్యూ ఢిల్లీ, జూలై31 :**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం ఎన్నో పరిశ్రమలను, మరెన్నో రంగాలను కుదేలు చేస్తున్నది. ఇండ్ల దగ్గర్నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌దాకా ఖరీదెక్కుతున్నాయి. సస్పెన్షన్ గ్రేడ్ పాలీవినైల్ క్లోరైడ్ (ఎస్‌పీవీసీ) ముడి సరుకు దిగుమతులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) కనీస దిగుమతి ధర (ఎంఐపీ) నిబంధనను విధించింది. దీంతో వాటర్ పైపులు, ఇతర ప్లంబింగ్ ఫిట్టింగ్స్, విద్యుత్తు కేబుల్స్ తయారీ ఖర్చులు పెరిగిపోనున్నాయి. వీటన్నిటి తయారీకి ఎస్‌పీవీసీ ముడి సరుకే ఆధారం మరి.గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వివరాల ప్రకారం.. డీజీఎఫ్‌టీ ఇటీవలి నోటిఫికేషన్‌తో ఎస్‌పీవీసీ ముడి సరుకు పదార్థాల దిగుమతులు ఉచితం నుంచి ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. ధర, బీమా, రవాణా విలువతో కలిపి కిలో 0.766 డాలర్లు (ప్రస్తుతం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ప్రకారం రూ.73.39) లేదా అంతకంటే తక్కువగా ఉన్న పీవీసీ ముడి సరుకు దిగుమతులకు ఈ ఆంక్షలు వర్తిస్తాయి. దీంతో ఈ దిగుమతులకు ఇకపై కస్టమ్స్ సుంకాలుంటాయి. అలాగే డీజీఎఫ్‌టీ నుంచి లైసెన్స్ కూడా తప్పనిసరి. అయితే కిలో విలువ 0.766 డాలర్లకు మించి ఉన్న సరుకు దిగుమతులు ఎప్పట్లాగే ఉచితం. ఈ నిబంధనలు వచ్చే 6 నెలలపాటు అమల్లో ఉంటాయి. ఈ క్రమంలో ఇంటి నిర్మాణ వ్యయాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన ఖర్చులు పెరుగుతాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. ఇండ్లలో వాడే వాటర్ సైప్లె పైపులు, ఇతర ఫిట్టింగ్స్, ఎలక్ట్రికల్ కేబుల్స్ తయారీకి డీజీఎఫ్‌టీ పెట్టిన పరిమితి లోపున్న ఈ పీవీసీ ముడి సరుకునే ఎక్కువగా వినియోగిస్తున్నారు.



**బడా కంపెనీలకు లాభం**

కేంద్రం తెచ్చిన నిబంధనలతో రిలయన్స్ ఇండస్ట్రీస్, కెమ్‌ప్లాస్ట్ సన్మార్, డీసీఎం శ్రీరామ్ వంటి దేశీయంగా ఉన్న బడా పీవీసీ ముడి సరుకు తయారీదారులకే లాభమని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. పెరిగే డిమాండ్‌కు తగ్గట్టు ఆయా కంపెనీలు ధరలు పెంచినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే పీవీసీ పైపులను ఎక్కువగా వాడే వ్యవసాయం, నిర్మాణ, మౌలిక రంగాలకు దెబ్బేనని హెచ్చరిస్తున్నారు.

**ఎంఎస్‌ఎంఈలకు నష్టం**

పీవీసీ పైపులు, ఫిట్టింగ్స్, కేబుల్స్, స్ప్రింగ్ పైప్స్, ఫిల్మ్స్, పాదరక్షలు, వైద్య ఉత్పత్తులు తదితరాలను తయారు చేసే ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వ నిర్ణయం ప్రధానంగా నష్టాన్ని కలిగిస్తుందని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. ముడి సరుకు వ్యయం భారంగా మారుతుందని అంటున్నారు. చివరకు ఆయా ఉత్పత్తుల ధరలను పెంచాల్సి వస్తుందని, అది అంతిమంగా వినియోగదారులకే దెబ్బని వివరిస్తున్నారు. నిజానికి చౌకగా విదేశాల నుంచి దేశీయ మార్కెట్‌లోకి వస్తున్న ఈ పీవీసీ ముడి సరుకుతో స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న సంస్థలు నష్టపోతున్నాయని, వారికి మద్దతు ఇచ్చేందుకు, ధరల స్థిరీకరణ, నాణ్యమైన ఉత్పత్తులను పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్రం వివరిస్తున్నది. అయితే ఈ ఆంక్షలతో దిగుమతులు తగ్గకపోగా, అదనపు భారం వల్ల ఆయా ఉత్పత్తుల ధరలు దేశీయ మార్కెట్‌లో పెరిగి వినియోగదారులే నష్టపోయే అవకాశాలున్నాయని జీటీఆర్ఐ అంటున్నది. దేశీయ డిమాండ్‌కు తగ్గ పీవీసీ ముడి సరుకు స్థానికంగా ఉత్పత్తి కాలేకపోతుండటమే ఇందుకు కారణమని చెప్తున్నది.

# కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో స్వర్ణం



### జూడోలో అస్మితా దే చరిత్ర.. భారత్‌కు తొలి గోల్డ్

### 18 పతకాలతో పట్టికలో 8వ స్థానంలో భారత్

**గ్లాస్గో, జూలై 31:** గ్లాస్గోలో జరుగుతున్న 23వ కామన్‌వెల్త్ గేమ్స్ (2026)లో భారత జూడో క్రీడాకారిణి అస్మితా దే కొత్త చరిత్ర సృష్టించారు. మహిళల 48 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించి, కామన్‌వెల్త్ గేమ్స్ జూడో పోటీలలో భారత్‌కు మొట్టమొదటి గోల్డ్ మెడల్ అందించిన క్రీడాకారిణిగా నిలిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో అస్మితా కెనడాకు చెందిన హెయిడీ క్యాచ్‌ను ఓడించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంతో జాగ్రత్తగా ఆడారు. ఒక దశలో కెనడా క్రీడాకారిణి 'యూకో' పాయింట్‌తో ఆధిక్యం సాధించినప్పటికీ, అస్మితా వెంటనే పుంజుకుని ప్రతిగా 'యూకో' పాయింట్ సాధించి 1-1తో సమానం చేశారు. నిర్ణీత సమయంలో ఇరు ప్రతినిధులు సమవుజ్జీలుగా నిలవడంతో మ్యాచ్ 'గోల్డెన్ స్కోర్' (సడన్ డెత్) కు దారితీసింది. ఒత్తిడిని జయించిన అస్మితా, సరైన సమయానికి అత్యంత ప్రతిభావంతమైన 'యూకో' పాయింట్‌ను సాధించి భారత్ కలల స్వర్ణాన్ని ఖాయం చేశారు. ఈ గెలుపుతో కామన్‌వెల్త్ గేమ్స్ జూడో చరిత్రలో స్వర్ణం సాధించిన మొదటి భారతీయ క్రీడాకారిణిగా అస్మిత నిలిచారు. ఆమె చూపిన ప్రతిభ, ఆత్మవిశ్వాసం దేశానికి గర్వకారణంగా మారాయి.

ఇప్పటి వరకు భారత్ సాధించిన పతకాల విషయానికి వస్తే.. స్వర్ణ పతకాల్లో.. అస్మితా దే (జూడో), మీరాబాయి చాను (వెయిట్‌లిఫ్టింగ్), షర్మిల ధాన్‌కర్ (పారా అథ్లెటిక్స్), దిలీప్ మహదు గావిత్ (పారా అథ్లెటిక్స్). రజత పతకాల విషయానికి వస్తే.. రిషికాంత సింగ్, ముత్తుపాండి రాజా, జ్ఞానేశ్వరి యాదవ్, హర్‌జిందర్ కౌర్, లవ్‌ప్రీత్ సింగ్ (వెయిట్‌లిఫ్టింగ్), సర్వేష్ కుషారే, గుల్వీర్ సింగ్, ఎం. శ్రీశంకర్ (అథ్లెటిక్స్). కాంస్య పతకాల విషయానికి వస్తే.. సీమా కలిరామ్నా, బింద్యారాణి దేవి, శిల్ప కె. షైలా, ఝుండూ కుమార్ సాధించారు. ప్రస్తుతం ఇండియా 4 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలతో మొత్తం 18 పతకాలు సాధించి 8వ స్థానంలో నిలిచింది.




# ప్రైవేట్ సంస్థలకు వరల్డ్‌కప్ హక్కుల విక్రయం?

### ఫిఫా ప్రతిపాదనపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత

### 20 బిలియన్ డాలర్ల ప్రణాళికతో వివాదంలో అధ్యక్షుడు ఇన్ఫాంటినో

**జ్యూరిక్, జూలై 31:** ప్రపంచ ఫుట్‌బాల్ పాలక సంస్థ ఫిఫా ప్రతిపాదించిన వరల్డ్‌కప్ వాణిజ్య హక్కుల విక్రయ ప్రణాళికపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫిఫా అధ్యక్షుడు జియాని ఇన్ఫాంటినో, ప్రపంచకప్‌తో పాటు క్లబ్ వరల్డ్‌కప్ వాణిజ్య హక్కులను సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన ప్రత్యేక అనుబంధ సంస్థగా మార్చి, అందులో 20 శాతం వాటాను ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు విక్రయించే ప్రతిపాదన తీసుకురావడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫిఫా సీనియర్ సలహాదారు కార్లోస్ కార్డెయిరో తన పదవికి రాజీనామా చేశారు. ఈ ప్రతిపాదన ఫుట్‌బాల్ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆయన పేర్కొంటూ, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫిఫా ప్రతిపాదనను ఇప్పటికే యూరప్, ఉత్తర అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్యలు తిరస్కరించగా, తాజాగా ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ కూడా వాటికి మద్దతు ప్రకటించింది. ఈ ప్రణాళికను ఉపసంహరించుకునే వరకు ఫిఫా నిర్వహించే టోర్నమెంట్‌లను బహిష్కరించే అంశాన్ని కూడా యూరోపియన్ సమాఖ్య పరిశీలిస్తున్నట్లు సమాచారం. విమర్శలపై స్పందించిన ఫిఫా, తాము ఫుట్‌బాల్‌ను విక్రయించడం లేదని స్పష్టం చేసింది. ప్రతిపాదిత పెట్టుబడి ప్రణాళికపై అపోహలు నెలకొన్నాయని, సభ్య దేశాలకు పగిర్తి వివరాలు తెలియజేస్తామని పేర్కొంది. అయితే ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ మాత్రం సభ్య దేశాలతో తగిన సంప్రదింపులు జరపకుండా నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని, ఫిఫా పరిపాలనా వ్యవస్థపై సమగ్ర సమీక్ష చేపట్టాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, వచ్చే ఏడాది జరగనున్న ఫిఫా అధ్యక్ష ఎన్నికల్లో జియాని ఇన్ఫాంటినో మరోసారి పోటీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ఈ వివాదం ఆయనకు రాజకీయంగా ప్రతికూలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రానున్న మహిళల అండర్-20 ప్రపంచకప్ నిర్వహణపై కూడా ఈ పరిణామాల ప్రభావం పడే అవకాశం ఉందని అంతర్జాతీయ క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 64 బంతుల్లో విధ్వంసం







### అజేయ శతకంతో శ్రీలంకకు చిరస్మరణీయ విజయం

### పాకిస్థాన్‌పై ఇమేషా దులాని వీరోచిత ఇన్నింగ్స్.. సిరీస్‌లో 1-0 ఆధిక్యం

**కొలంబో, జూలై 31:** పాకిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో శ్రీలంక మహిళా క్రికెటర్ ఇమేషా దులాని అద్భుతమైన శతకంతో సంచలనం సృష్టించింది. ఈ ఇన్నింగ్స్‌తో ఆమె శ్రీలంక జట్టును విజయతీరాలకు చేర్చడమే కాకుండా ఒక అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో శ్రీలంక తరఫున సెంచరీ చేసిన రెండో మహిళా బ్యాటర్‌గా దులాని నిలిచింది. అంతకుముందు 2019లో ఆస్ట్రేలియాపై చామరి అటపట్టు శ్రీలంక తరఫున తొలి సెంచరీ సాధించగా, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత దులాని (64 బంతుల్లో 101 నాటౌట్) ఈ ఘనత సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో శ్రీలంక 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టాస్ గెలిచిన శ్రీలంక మొదట ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరు చేసింది. పాకిస్థాన్ ఇన్నింగ్స్‌లో షవాల్ జుల్ఫికర్ 61 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ మునీబా అలీ 42 పరుగులు సాధించింది. శ్రీలంక బౌలర్లలో కవిషా దిల్హారి రెండు వికెట్లు తీయగా, కావ్య కవింది, సుగంధిక కుమారి, చాముడి ప్రబోధ తలొక వికెట్ పడగొట్టారు. అనంతరం 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఓపెనర్లు ఇమేషా దులాని, కెప్టెన్ చామరి అటపట్టు మొదటి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో మంచి ప్రారంభాన్ని ఇచ్చారు. నాశ్రా సంధూ బౌలింగ్‌లో అటపట్టు (39) అవుట్ అయిన తర్వాత, విశిమి గుణరత్నే (3), హర్షిత సమరవిక్రమ (7), కవిషా దిల్హారి (11) త్వరత్వరగానే నిష్క్రమించారు. అయితే ఒకవైపు వికెట్లు పడుతున్నా దులాని మాత్రం క్రీజులో నిలకడగా ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లను ఎదుర్కొంది. ఆమె తన ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 101 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది. 19వ ఓవర్ చివరి బంతికి శ్రీలంక విజయాన్ని ఖాయం చేసుకుంది. పాకిస్థాన్ బౌలర్లలో నాశ్రా సంధూ రెండు వికెట్లు పడగొట్టింది.




# వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ.. సరైన నిర్ణయమేనా?

### దులీప్ ట్రోఫీ ఎంపికపై హర్షా భోగ్లే సందేహాలు

### 15 ఏళ్ల ఆటగాడికి నాయకత్వ బాధ్యతలపై క్రికెట్ వర్గాల్లో చర్చ

**ముంబై, జూలై 31:** భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి దులీప్ ట్రోఫీ కోసం ప్రకటించిన ఈస్ట్ జోన్ జట్టులో వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించడంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. 2026-27 దేశీయ సీజన్‌కు ఎంపికైన జట్టులో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా ఉండగా, కేవలం 15 ఏళ్ల వయసున్న వైభవ్‌ను ఉప కెప్టెన్‌గా నియమించడం విశేషంగా మారింది. ఈ నిర్ణయంపై భారత ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెడ్‌బాల్ క్రికెట్‌లో పరిమిత అనుభవం ఉన్న ఆటగాడికి ఇంత త్వరగా నాయకత్వ బాధ్యతలు అప్పగించడం వెనుక ఉన్న ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని పేర్కొన్నారు. "వైభవ్ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడే. కానీ ఇప్పటివరకు రెడ్‌బాల్ క్రికెట్‌లో 12 ఇన్నింగ్స్‌ల్లో 207 పరుగులు మాత్రమే చేశాడు. అతని సగటు 17.25. ఇంకా నేర్చుకునే దశలో ఉన్న ఆటగాడికి ఉప కెప్టెన్సీ అవసరమా?" అని హర్షా భోగ్లే ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ, అదే జోరుతో ఈస్ట్ జోన్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికి పరిమిత అనుభవమే ఉంది. ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన వైభవ్ 207 పరుగులు చేయగా, అత్యధిక స్కోరు 93గా నమోదైంది. దులీప్ ట్రోఫీలో వైభవ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ షమీ, ముఖేశ్ కుమార్ వంటి అనుభవజ్ఞులైన పేసర్లు జట్టుకు బలాన్నివ్వనున్నారు. వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ ఇవ్వడం ద్వారా భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దాలనే ఉద్దేశమా, లేక అతని ప్రతిభపై సెలెక్టర్లకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమా అన్న అంశంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. దులీప్ ట్రోఫీలో బ్యాటింగ్‌తో పాటు నాయకత్వ లక్షణాలను కూడా వైభవ్ ఎలా ప్రదర్శిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

# రుతురాజ్, పటీదార్‌కు మళ్లీ నిరాశ

### భారత్ టెస్టు జట్టులో చోటు దక్కని ఐదుగురు ప్రముఖులు

### శ్రీలంక సిరీస్‌కు 15 మంది జట్టును ప్రకటించిన బీసీసీఐ




న్యూఢిల్లీ, జూలై 31: శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. యువ ఆటగాడు సారాంశ్ జైన్‌కు తొలిసారి అవకాశం కల్పించగా, పలువురు ప్రముఖులకు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాల్‌లో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలో రెండో టెస్టు జరగనుంది. సిరీస్‌కు ముందు ఆగస్టు 7 నుంచి భారత జట్టు నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ జట్టు ఎంపికలో సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి మరోసారి అవకాశం దక్కలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత జట్టుకు దూరంగా ఉన్న షమీ దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నప్పటికీ సెలెక్టర్లు ఆయనను పరిగణనలోకి తీసుకోలేదు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనలు చేస్తున్న రుతురాజ్ గైక్వాడ్, రజత్ పటీదార్‌లకు కూడా నిరాశే ఎదురైంది. అలాగే రంజీ ట్రోఫీలో అత్యధిక వికెట్లు సాధించిన జమ్మూ కాశ్మీర్ పేసర్ ఆకిబ్ నబీ దార్‌కు కూడా జట్టులో స్థానం లభించలేదు. గతంలో ఫిట్‌నెస్ మెరుగుపర్చుకుని తిరిగి రాణించిన సర్ఫరాజ్ ఖాన్‌ను కూడా సెలెక్టర్లు పక్కన పెట్టారు. శుభ్‌మన్ గిల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జట్టులో యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్ తదితరులు చోటు దక్కించుకున్నారు. వాషింగ్టన్ సుందర్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండరని బీసీసీఐ వెల్లడించింది. సాయి సుదర్శన్, జస్ప్రీత్ బుమ్రా తుది జట్టులో ఆడే విషయంపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపింది. అయితే బుమ్రా ఫిట్‌నెస్ సాధించినట్లు వార్తలు వస్తుండటంతో తొలి టెస్టులో ఆయన బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నటనలో అడుగుపెట్టా

## అందాల తార ప్రీతి ముకుందన్ అంతరంగం

తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అందాల తార ప్రీతి ముకుందన్ అభిప్రాయపడింది. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టానని అంది.

# దీపావళి బరిలో సూర్య 48 మూవీ




కథానాయకుడు సూర్య ఇటీవలే 'కరుప్పు' సినిమా విజయంతో తదుపరి చిత్రాల విషయంలో జోరు పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఆయన... మమితా బైజు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల్ని మరోసారి పలకరించనున్నారు. అయితే తాజాగా సూర్య, కథానాయిక నజ్రియా జంటగా రూపొందుతున్న 'సూర్య 48' చిత్రం కూడా విడుదల తేదీని ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని చిత్రబృందం దీపావళికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. దీపావళికి విడుదల ఖరారైతే ఈ ఏడాది సూర్య ఖాతాలో మూడు చిత్రాలు చేరనున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో

# 3న అగాధ ట్రైలర్ విడుదలకు సన్నాహాలు




సీనియర్ దర్శకుడు, నిర్మాత ఎంఎస్ రాజు మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'అగాధ'. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 3 మధ్యాహ్నం 12 గంటలకు 'అగాధ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ ద్వారా సినిమా కథ, ఆధ్యాత్మిక నేపథ్యం, మిస్టరీ ఎలిమెంట్స్‌పై మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేలా ట్రైలర్ ఉండబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కెఆర్ సమర్పిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ఎంఎస్ రాజు స్వయంగా నిర్వహించడం విశేషం. తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించిన ఆయన, ఈసారి విభిన్నమైన ఆధ్యాత్మిక థ్రిల్లర్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్లతో పాటు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయా రాణి రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. భారీ స్థాయిలో రూపొందిన 'అగాధ' చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుండటంతో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తీసుకురాబోతున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ట్రైలర్ విడుదల అనంతరం మరింత దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహించనుంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎంఎస్ రాజుకు దర్శకుడిగా మరో విజయాన్ని అందిస్తుందా అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.

# వారణాసి వాయిదా ప్రచారాలకు చెక్

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మెగా ప్రాజెక్ట్ వారణాసిపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వాయిదా ప్రచారాలకు ఫుల్ స్టాప్ పడింది. ఈ సినిమా ప్రకటించిన తేదీకే విడుదల కానుందని చిత్ర యూనిట్‌కు చెందిన విశ్వసనీయ వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అభిమానుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు స్టార్‌ల కలయికతో పాటు రాజమౌళి దర్శకత్వం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృత స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల కారణంగా విడుదల తేదీ మారొచ్చని ప్రచారం జరిగింది. అయితే చిత్ర యూనిట్ వర్గాల సమాచారం ప్రకారం అలాంటి పరిస్థితి ఏదీ లేదని, సినిమా ముందుగా ప్రకటించినట్లుగానే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రణాళిక ప్రకారమే కొనసాగుతున్నాయని సమాచారం. ఇప్పటికే కీలక షెడ్యూళ్లు పగీర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులో పగీర్తి చేసేలా చిత్రబృందం పని చేస్తోందని తెలుస్తోంది. 'వారణాసి' విడుదలకు ఇంకా 250 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అభిమాను ల్లో ఉత్సాహం మరింత పెరిగింది. రాజమౌళి ప్రతి సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించే తీరు, మహేష్ బాబు తొలిసారి ఆయన దర్శకత్వంలో నటిస్తుండటం, ప్రియాంక చోప్రా రీఎంట్రీ వంటి అంశాలు ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. భారీ బ్జడెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్తుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల తేదీపై స్పష్టత రావడంతో ఇకపై చిత్రబృందం నుంచి టీజర్, పోస్టర్లు, ఇతర ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన వరుస అప్‌డేట్లు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# రామాయణ మూవీలో డ్రెస్సింగ్‌పై సోషల్ మీడియాలో రచ్చ

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలైనప్పటి నుంచీ పలు అంశాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. తాజాగా ఈ చిత్రంలో రాణి కైకేయి పాత్రలో నటిస్తున్న ప్రముఖ నటి లారా దత్తా తొలి లుక్‌పై నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. త్రేతాయుగంలో సాగిన పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో, లారా దత్తా ధరించిన మోడ్రన్ డిజైనర్ బ్లౌజ్, స్టైలిష్ హెయిర్‌స్టైల్ పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. త్రేతాయుగ కాలానికి తగినట్లుగా కాకుండా, ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా నీట్‌గా కుట్టిన డిజైనర్ బ్లౌజ్, హెయిర్, సెలూన్ స్టైల్ హెయిర్‌స్టైల్‌తో లారా కనిపించడంపై విమర్శలు వస్తున్నాయి. త్రేతా యుగంలో ప్లెయిన్ రా సిల్క్ చీరలు, హెవీ స్టోన్ ఎంబ్రాయిడరీ, కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు ఎవరూ డిజైన్ చేసేవారు? అంటూ కొందరూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక లారా దత్తా లుక్ చూస్తుంటే రామాయణంలా కాకుండా, ఏవో ఏక్తా కపూర్ టీవీ సీరియల్ షూటింగ్‌లో పాల్గొన్నట్లుగా ఉందని మరికొందరు కామెంట్ చేశారు. ఇక సినిమా మేకర్స్ తీసుకున్న ఈ సృజనాత్మక స్వేచ్ఛ, కాస్ట్యూమ్ డిజైన్ పై వస్తున్న విమర్శలపై చిత్ర యూనిట్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి! మహర్షి వాల్మీకి రామాయణం, తులసీదాస్ రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, రవి దూబే, అరుణ్ గోవిల్, వివేక్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 దీపావళి



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com